# ఉత్తర అమెరికా తెలుగు సంఘం

తానా ప్రపంచసాహిత్యవేదిక ఆధ్వర్యంలో

## నెల నెలా తెలుగు వెలుగు

(ప్రతి నెల ఆఖరి ఆదివారం - 78వ అంతర్జాతీయ అంతర్జాల దృశ్యసమావేశము)

(ఆదివారం, మార్చి 30, 2025 భారతకాలమానం : 6.30 pm ; అమెరికా : 6.00am PST ; 8.00am CST ; 9.00am EST)

శ్రీ విశ్వావసు నామ ఉగాది పర్వదిన సందర్భంగా...

# అంతర్జాతీయ ఉగాది కవిసమ్మేళనం

అంశం :

## "రైతన్నా ! మానవజాతి మనుగడకు మూలాధారం నీవేనన్నా"



YUPPTV

ప్రత్యక్ష ప్రసారం : యప్ టి.వి.లో
" తానా ప్రపంచ సాహిత్య వేదిక "
టి.వి. ఛానల్ ద్వారా

| నిరంజన్ శృంగవరపు | చిగురుమళ్ళ శ్రీనివాస్ | డా॥ ప్రసాద్ తోటకూర |
|---|---|---|
| అధ్యక్షులు, తానా | సమన్వయ కర్త, తానా ప్రపంచ సాహిత్య వేదిక | నిర్వాహకులు తానా ప్రపంచ సాహిత్య వేదిక |

## ముఖ్యఅతిథి

## విశిష్టఅతిథులు - 1



'పద్మశ్రీ పురస్కారగ్రహీత', 'రైతు నేస్తం'

**శ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు**

గుంటూరు, ఆంధ్రప్రదేశ్



**శ్రీ దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి**

యర్ర ఓబన్నపల్లె, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్



**శ్రీ మంత్రి కృష్ణమోహన్**

మార్కాపురం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్



**శ్రీ పాయల మురళీకృష్ణ**

మెంటాడ, విజయనగరం జిల్లా,ఆంధ్రప్రదేశ్



**శ్రీ నన్నపనేని రవి**

ఉలిచి, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్



**డా. తలారి డాకన్న**

అక్నాపూర్, వికారాబాద్ జిల్లా, తెలంగాణ



**శ్రీ చొక్కర తాతారావు**

విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్



**శ్రీ రామ్ డొక్కా**

ఆస్టిన్, అమెరికా



**శ్రీమతి దొండపాటి నాగజ్యోతి శేఖర్**

మురమళ్ళ, కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్



**శ్రీ ర్యాలి ప్రసాద్**

కాకినాడ, ఆంధ్రప్రదేశ్



**శ్రీమతి సాలిపల్లి మంగామణి (శ్రీమణి)**

విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్



**శ్రీ సిరికి స్వామినాయుడు**

పార్వతీపురం, మన్యం జిల్లా , ఆంధ్రప్రదేశ్

## విశిష్టఅతిథులు - 2


శ్రీమతి తన్నీరు శశికళ
నెల్లూరు ,ఆంధ్రప్రదేశ్


శ్రీమతి చేబ్రోలు శశిబాల
హైదరాబాద్, తెలంగాణ


శ్రీమతి లలితా రామ్
అరెగాన్, అమెరికా


శ్రీ బాలసుధాకర్ మౌళి
విజయనగరం, ఆంధ్రప్రదేశ్


శ్రీ గంటేడ గౌరునాయుడు
దళాయి పేట, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్


శ్రీ కోసూరి రవికుమార్
దాచేపల్లి, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్


శ్రీ మార్ని జానకిరామ చౌదరి
కాకినాడ, ఆంధ్రప్రదేశ్


శ్రీ కె.ఎ.మునిసురేష్ పిళ్ళై
శ్రీకాళహస్తి, ఆంధ్రప్రదేశ్


డా.బీరం సుందరరావు
చీరాల, ఆంధ్రప్రదేశ్


డా.వేంకట నక్త రాజు
డాలస్, అమెరికా


శ్రీ బండ్ల మాధవరావు
విజయవాడ, ఆంధ్రప్రదేశ్


డా.కొండపల్లి నీహారిణి
హైదరాబాద్, తెలంగాణ

# " రైతన్నా ! మానవ జాతి మనుగడకు మూలాధారం నీవేనన్నా "

## విశిష్టఅతిథులు - 3



**శ్రీమతి నారదభట్ల అరుణ**
హైదరాబాద్, తెలంగాణ



**శ్రీమతి పి. అమరజ్యోతి**
అనకాపల్లి , ఆంధ్రప్రదేశ్



**శ్రీ యార్లగడ్డ రాఘవేంద్రరావు**
హైదరాబాద్, తెలంగాణ



**శ్రీ చిటిప్రోలు సుబ్బారావు**
హైదరాబాద్, తెలంగాణ



**డా. శ్రీరమ్య రావు**
న్యూజెర్సీ, అమెరికా



**డా.శ్రీదేవి శ్రీకాంత్**
బోట్స్వానా, దక్షిణాఫ్రికా



**డా. భాస్కర్ కొంపెల్ల**
పెన్సిల్వేనియా, అమెరికా



**శ్రీ ఆది మోపిదేవి**
కాలిఫోర్నియా, అమెరికా



**డా.కె. గీత**
కాలిఫోర్నియా, అమెరికా



**శ్రీ శ్రీధర్ రెడ్డి బిల్లా**
కాలిఫోర్నియా, అమెరికా

# అన్నదాతకు అక్షర నీరాజనం



**నిరంజన్ శృంగవరపు**
తానా అధ్యక్షులు

**అందరికీ నమస్కారం!**

ఉత్తర అమెరికా తెలుగు సంఘం, తానా సాహిత్యవిభాగం – తానా ప్రపంచసాహిత్యవేదిక 'నెల నెల తెలుగు వెలుగు' పేరుతో ప్రతి నెల ఆఖరి ఆదివారం నిర్వహిస్తున్న సాహిత్యకార్యక్రమలలో భాగంగా 78వ సాహిత్య కార్యక్రమం శ్రీ విశ్వావసు నామ ఉగాది పర్వదిన సందర్భంగా జరుగుతున్న ఈ అంతర్జాతీయ ఉగాది కవిసమ్మేళనానికి విచ్చేసిన అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

తానా ప్రపంచసాహిత్యవేదిక నిర్వాహకులు డాక్టర్. ప్రసాద్ తోటకూర గారికి, సాహిత్యవేదిక సమన్వయకర్త, శతాధిక శతక గ్రంథకర్త శ్రీ చిగురుమళ్ళ శ్రీనివాస్ గారికి, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన 'పద్మశ్రీ' యడ్లపల్లి వెంకటేశ్వరరావు గారికి, విశిష్టఅతిథులుగా విచ్చేసిన శ్రీ దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి, శ్రీ మంత్రి కృష్ణ మోహన్, శ్రీ పాయల మురళీకృష్ణ, శ్రీ నన్నపనేని రవి, డాక్టర్. తలారి డాకన్న, శ్రీ చొక్కర తాతారావు, శ్రీ రామ్ డొక్కా, శ్రీమతి దొండపాటి నాగజ్యోతి శేఖర్, శ్రీ ర్యాలీ ప్రసాద్, శ్రీమతి సాలిపల్లి మంగామణి (శ్రీమణి), శ్రీ సిరికి స్వామినాయుడు, శ్రీమతి తన్నీరు శశికళ, శ్రీమతి చేబ్రోలు శశిబాల, శ్రీమతి లలితారామ్, శ్రీ బాలసుధాకర్ మౌళి, శ్రీ గంటేడ గౌరునాయుడు, శ్రీ కోసూరి రవికుమార్, శ్రీ మార్ని జానకిరామ చౌదరి, శ్రీ కె.ఎ మునిసురేష్ పిళ్ళై, డాక్టర్. బీరం సుందర రావు, డాక్టర్. వేంకట నక్త రాజు, శ్రీ బండ్ల మాధవరావు, డాక్టర్. కొండపల్లి నిహారిణి, శ్రీమతి నారదభట్ల అరుణ, శ్రీమతి పి. అమరజ్యోతి, శ్రీ యార్లగడ్డ రాఘవేంద్రరావు, శ్రీ చిటిప్రోలు సుబ్బారావు, డాక్టర్ శ్రీ రమ్య రావు, డాక్టర్. శ్రీదేవి శ్రీకాంత్, డాక్టర్. భాస్కర్ కొంపెల్ల, శ్రీ ఆది మోపిదేవి, డాక్టర్. కె. గీత, శ్రీ శ్రీధర్ రెడ్డి బిల్లా గార్లకు అందరికీ స్వాగతం.

"రైతన్నా! మానవజాతి మనుగడకు మూలాధారం నీవేనన్నా" అనే అంశం మీద కవులు, పండితులు తమ తమ స్వీయ కవితాగానాలు చెయ్యడం ఎంతో సంతోషంగా ఉంది.

ఒక రైతుబిడ్డగా రైతన్నల కన్నీళ్లు, కష్టాలు, వారి స్థితిగతులు నాకు బాగా తెలుసు. రైతే రాజు! అని అంటారు కానీ అమెరికాలాంటి అభివృద్ధిచెందిన దేశాలలో

వ్యవసాయరంగానికి లభిస్తున్న ప్రభుత్వ సహాయం మన దేశంలో లభించడంలేదు అనడం అతిశయోక్తి కాదు.

సాగునీరు అందించడం దగ్గరనుంచి, వ్యవసాయ రుణాలు అందించడం దగ్గరనుంచి, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, మందులు రైతులకు అందుబాటులో ఉంచటం, పంటల బీమాపథకాలను అమలుచేయడం, మార్కెటింగ్ సౌకర్యాలు, గిట్టుబాటు ధరలు, స్టోరేజీ సౌకర్యాలు అందించడంలో మన ప్రభుత్వాలు విఫలమవుతూనే ఉన్నాయి.

ఈ కారణంగానే రైతన్నలు దిక్కుతోచని స్థితిలో అప్పుల బారిన పడి, పంటలు నష్టాలకు గురై, ఆత్మహత్యలకు పాల్పడుతూ, వ్యవసాయ రంగం దయనీయమైన స్థితిలో ఉండటం మనం గమనిస్తున్నాం.

అందరికీ అన్నంపెట్టే రైతన్నకు అండగా నిలబడాల్సిన అవసరంఉంది. అత్యధికమైన జనాభావున్న మనదేశంలో, 70% వ్యవసాయంపై ఆధారపడే మన దేశంలో వ్యవసాయరంగాన్ని పునరుద్ధరించడానికి అందరూ పూనుకోవాలి. గ్రామాల్లో ఈనాడు వ్యవసాయరంగంవైపు యువత మొగ్గు చూపటంలేదు. భవిష్యత్తులో ఆహారధాన్యాలు కూడా చైనాలాంటి దేశాలనుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు మనదేశ ఆర్థికవ్యవస్థ కుదేలవుతుంది. ఇకనైనా ప్రభుత్వాలు కళ్ళు తెరవాలి, ప్రభుత్వాలను కళ్ళు తెరిపించే బాధ్యత ప్రజలది, ప్రజలందరినీ చైతన్యవంతులుగా తయారుచేసే బాధ్యత కవులది, కళాకారులది.

కవులందరూ తమ కలాలకు పదునుపెట్టి, రైతన్నల కష్టాలను వ్యవసాయరంగ పరిస్థితిని ప్రజల కళ్ళకు కట్టేటట్టు చెప్పి ప్రభుత్వాలను మేల్కొల్పాలి.

కవులు తమ కవిత్వం ద్వారా ఇటు ప్రభుత్వాలని, అటు ప్రజలని చైతన్యవంతులను చేస్తారని ఆశిస్తూ మీ అందరి దగ్గర సెలవు తీసుకుంటున్నాను.

ధన్యవాదములు

**- నిరంజన్ శృంగవరపు**

తానా అధ్యక్షులు

# సమస్యల సుడిగుండాలలో సాహసవీరుడు
# కర్షకుడు



**డా. తోటకూర ప్రసాద్**

**తానా పూర్వాధ్యక్షులు: 2011-2013 మరియు ప్రస్తుత తానా ప్రపంచసాహిత్యవేదిక నిర్వాహకులు**

భారతదేశంలో ఉన్న 144 కోట్ల జనాభాలో సుమారుగా 64% మంది గ్రామీణ ప్రాంతాలలోను మిగిలిన 36% మంది పట్టణాలలోను నివసిస్తున్నారు. మనదేశంలో రమారమి 7 లక్షల గ్రామాలున్నాయి. భారతదేశ జనాభాలో సుమారు 55% నుంచి 60% ప్రజలు ఇప్పటికీ వ్యవసాయమే వృత్తిగా జీవనం సాగిస్తున్నారు. భారతదేశానికి జి.డి.పి అంటే స్థూల దేశీయోత్పత్తి పరంగా వచ్చే ఆదాయంలో సుమారుగా 18% ఆదాయం వ్యవసాయరంగం ద్వారానే సమకూరుతుంది.

అనేక పంటల ఉత్పత్తిలో దేశం స్వయం సంవృద్ధి సాధించి, విదేశాలకు ఎగుమతిచేసే స్థాయిలోఉన్నా ఆరుగాలం శ్రమించి ఆ పంటలు పండించిన రైతుజీవితం మాత్రం ఎదుగుదల లేక తర తరాలగా దిగువస్థానంలోనే మిగిలిపోతున్నది. దీనికి కారణాలు పరిశీలిస్తే అనేకం....

**అ.** రైతన్నలకు ప్రభుత్వాల హుళక్కి హామీలు, శుష్క వాగ్దానాలు, అవసర సమయంలో అందించని సహాయం. అందుకే మనం అప్పుడప్పుడూ చూస్తుంటాం దేశం యావత్తూ రైతు నిరసన ప్రదర్శనలు.

**ఆ.** నాణ్యతలేని నాసిరకం నకిలీ విత్తనాలు, అవసరమైన నీటి సదుపాయం లేకపోవడం, కరెంట్ కోత సమస్యలు, పైరును రక్షించుకోవడానికి వాడే రోగనివారణ మందులలో పసలేకపోవడం, కలుపు ఏరివేత మొదలుకుని, పంట పండి, చేతికొచ్చి, ఇంటికి చేరే వరకు ఉన్న వివిధ దశలలోఉన్న రైతుకూలీల కొరత సమస్యలు.

**ఇ.** పంటచేతికొచ్చే సమయానికి దాపురించే అతివృష్టి, అనావృష్టి వర్షాలు, ఈదురు గాలులు, తుఫాను బీభత్సం సమస్యలతో ప్రకృతి వికృతవలయంలో రైతుజీవితం కకావికలం.

**ఈ.** అన్ని బాలారిష్టాలను దాటుకుని పండిస్తే, దళారీల చేతచిక్కి మోసపోవడం, అనుకున్నవి అన్నీ సమకూరి, ఊహించినదానికన్నా అధిక దిగిబడివస్తే, నిల్వ చేసుకోవడానికి సరైన వసతులులేక, ఆశించిన గిట్టుబాటు ధరలేక, రవాణా ఖర్చులు కూడా రాక, పండిన పంటను రోడ్లపై పారబోసి దిగాలుగా ఇల్లు చేరే రైతు.

**ఉ.** రాళ్ళు కొట్టే కార్మికునికి తన రోజువారీ వేతనం ఎంతో తెలుసు! పెద్ద హోదాలో ఉన్న అధికారికీ తెలుసు తన నెలసరి జీతం ఎంతో! కాని ఆరుగాలం కష్టపడి, అప్పులుజేసి, పస్తులుండి, పుస్తెలమ్మి, భూమిని నమ్ముకుని, పదిమందికీ పట్టెడన్నం పంచడంకోసం అహర్నిశలు రెక్కలు ముక్కలుజేసుకునే రైతన్నది మాత్రం జీతం గ్యారంటీ లేని జీవితం.

**ఊ.** విచిత్రమేమిటంటే – ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా, నిబ్బరం కోల్పోక, నిరాశపడక, తనకున్న భూమే బంగారంగా, పశువులే సంపదగా, తలకు గుడ్డచుట్టి, చేత కర్రపట్టి, ఠీవిగా సాగిపోతాడు రైతన్న దేన్నీ లెక్కచేయక!

అందుకే – **"రైతన్నా ! మానవజాతి మనుగడకు మూలాధారం నీవేనన్నా!**

భారతదేశంలో పండే ప్రధాన పంటలస్థాయి ప్రపంచంలోని ఇతర దేశాలలో పండే పంటలస్థాయితో పోల్చిచూస్తే ఎలా ఉందో ఒకసారి పరిశీలిద్దాం!

**వరి:** ప్రపంచంలో వరిసాగులో భారతదేశం ప్రథమ స్థానంలో ఉండగా, ఉత్పత్తిలో మాత్రం చైనా తొలి స్థానంలో ఉంది.

**గోధుమ:** ప్రపంచంలో గోధుమ ఉత్పత్తులలో భారతదేశం రెండో స్థానంలో, చైనా మొదటి స్థానంలో ఉన్నాయి.

**జొన్నలు:** ప్రపంచంలో జొన్నల ఉత్పత్తిలో భారతదేశం మొదటి స్థానంలో ఉంది. (మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జొన్నలను విరివిగా సాగుచేస్తున్నారు)

**సజ్జలు:** ప్రపంచంలో సజ్జల ఉత్పత్తిలో భారతదేశం మొదటి స్థానంలో ఉంది. (మధ్యప్రదేశ్, హరియాణా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో ఎక్కువగా పండిస్తున్నారు)

**పప్పుధాన్యాలు:** శెనగలు, కందులు, పెసలు, మినుములు, ఉలవలలాంటి పప్పుధాన్యాల ఉత్పత్తిలోను, నూనెగింజల ఉత్పత్తిలోను భారతదేశం ప్రపంచంలో మొదటిస్థానంలో ఉంది.



**పత్తి:** పత్తి సాగులో భారతదేశం ముందువరసలో ఉన్నా - ఉత్పత్తిలో మాత్రం అమెరికా, చైనా దేశాలు అగ్రస్థానాలలో ఉన్నాయి.

**చెరకు:** చెరకు ఉత్పత్తిలో ప్రపంచంలో భారతదేశం ద్వితీయ స్థానంలో ఉండగా, బ్రెజిల్ దేశం మొదటి స్థానంలో ఉంది.

**జనుము:** జనుము ఎగుమతులలో భారతదేశం రెండవ స్థానంలో ఉండగా, బంగ్లాదేశ్ ప్రధమ స్థానంలో ఉంది.

**పొగాకు:** పొగాకు ఉత్పత్తిలో భారతదేశం తృతీయ స్థానంలో, బ్రెజిల్ ద్వితీయ స్థానంలో, చైనా ప్రధమ స్థానంలో ఉన్నాయి.

**తేయాకు:** తేయాకు ఉత్పత్తిలో భారతదేశం ద్వితీయ స్థానంలో, చైనా ప్రధమ స్థానంలో ఉన్నాయి.

**పండ్లతోటలు:** మామిడి, జీడిమామిడి, యాపిల్, ద్రాక్ష, అరటి, జామ, సీతాఫలం, బొప్పాయి, నారింజ మొదలైన పండ్ల ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలో ద్వితీయ స్థానంలో ఉంది.

**పట్టు:** పట్టు ఉత్పత్తిలో భారతదేశం ద్వితీయ స్థానంలోను, చైనాదేశం ప్రధమ స్థానంలోను ఉన్నాయి.

నిర్దిష్ట వ్యవసాయ ఉత్పత్తులపై దృష్టిసారించేందుకు భారతదేశంలో అనేక వ్యవసాయ విప్లవాలు జరిగాయి. వివిధ సంవత్సరాలలో, కొంతమంది ప్రముఖులు ఈ వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ వస్తువుల అధికోత్పత్తికై అనేక విప్లవాలకు శ్రీకారం చుట్టారు. వాటిలో కొన్ని ...

**రౌండ్ విప్లవం:** బంగాళదుంపల ఉత్పత్తి (1965-2005)

**హరిత విప్లవం:** వరి, గోధుమ ఉత్పత్తి (1966-1967) ఆద్యులు: నార్మన్ బోర్లాగ్ మరియు ఎం.ఎస్. స్వామినాథన్

**గ్రే విప్లవం:** ఎరువులు మరియు ఉన్ని ఉత్పత్తి (1960-1970)

**పింక్ విప్లవం:** రొయ్యలు మరియు ఉల్లిపాయల ఉత్పత్తి (1970) ఆద్యులు: దుర్గేష్ పటేల్

**శ్వేత విప్లవం:** పాల ఉత్పత్తి (1970-1996) ఆద్యులు: వర్గీస్ కురియన్

**నీలి విప్లవం:** చేపల ఉత్పత్తి (1973-2002) ఆద్యులు: డా. అరుణ్ కృష్ణన్

**ఎర్ర విప్లవం:** మాంసం మరియు టమోటా ఉత్పత్తి (1980) ఆద్యులు: విశాల్ తివారీ

**పసుపు విప్లవం:** నూనెగింజల ఉత్పత్తి (1986-1990) ఆద్యులు: శ్యాం పిట్రోడా

**బ్రౌన్ విప్లవం:** తోలు మరియు కోకో ఉత్పత్తి. ఆద్యులు: హీరాలాల్ చౌదరి

**గోల్డెన్ ఫైబర్ విప్లవం:** జనపనార ఉత్పత్తి (1990)

**స్వర్ణ విప్లవం:** పండ్లు, తేనె, ఉద్యానవన పంటల ఉత్పత్తి (1991–2003) ఆద్యులు: నిర్పాఖ్ తుతాజ్

**వెండి విప్లవం:** కోళ్ళు, కోడిగుడ్ల ఉత్పత్తి (2000) ఆద్యులు: ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ

**సిల్వర్ ఫైబర్ విప్లవం:** పత్తి (2000)

**ప్రోటీన్ విప్లవం:** వ్యవసాయం (2014–2020). ఆద్యులు: ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ

నల్ల విప్లవం: పెట్రోలియం ఉత్పత్తి (ఇథనాల్ ఉత్పత్తిని పెంచి దాన్ని పెట్రోల్‌తో కలిపి బయోడీజిల్ ను తయారు చేయడంవల్ల రైతులకు మంచి రాబడి వస్తుంది)

వివిధ కాలాల్లో అనేకమంది రచయితలు, కవులు రైతుజీవితం మీద, రైతుసమస్యల పైన ఎన్నో కథలు, నవలలు, కావ్యాలు, కవితలు వ్రాశారు. అలాంటి అలనాటి కవులను కొంతమందిని తలుచుకుని, వారు వ్రాసిన కవితలను తెలుసుకుని వారికి 'అక్షర కర్షక నీరాజనాలర్పిద్దాం'.

## గుర్రం జాషువా

(గుంటూరు జిల్లాలో 'చాట్రగడ్డపాడు' గ్రామంలో 1895లో జన్మించి, 1971లో గుంటూరు నగరంలో పరమపదించిన కవికోకిల, నవయుగ కవిచక్రవర్తి, పద్మభూషణ్ గుర్రం జాషువా)

### రైతు కష్టజీవి అంటూ ..

"వాని రెక్కల కష్టంబు లేనినాడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనంబెట్టు వానికి భుక్తి లేదు" అని వాపోయారు.

★ ★ ★ ★ ★

## ఇనగంటి పున్నయ్య చౌదరి

(గుంటూరు జిల్లా 'అప్పికట్ల' గ్రామంలో 1890 లో జన్మించి, 1954లో కాలంచేసిన రైతుకవి ఇనగంటి పున్నయ్య చౌదరి గారు – తాను రాసిన 'రైతు కన్నీరు' అనే లఘుకావ్యంలో రైతు పండించే రకరకాల వరిధాన్యాలను అద్భుతంగా వర్ణించారు). వరిధాన్యాలలో కొన్ని వేల రకాలున్నాయి, వాటిలో కొన్నింటిని ప్రస్తావిస్తూ ...

"వంకసన్నంబులు, కుంకుమపువ్వులు,
గుంద్రసంబవ, మొలకొలుకు, కుసుమ,

సన్న కొనామణి, చిన్నపిషాణీలు,
పెదకాకిరెక్కలు, పిన్నకుసుమ,
పాలాట్రగడ్డలు, బంగారుతీగెలు,
సన్నంపుముత్యాలు, జున్నుబాలు,
వంకెలు, పగడాలు, వరడిల్లి భోగాలు,
రామసాగరములు, రాజనాలు
ముద్దులలరంగ బండించి, మూటగట్టి
దండుగలకింద సర్వంబు ధారపోసి
పొట్టకన్నములేక, వాపోవుటాయె
రమ్మ – లేలెమ్మ – మేల్కొమ్ము! – రైతుబిడ్డ.”

ఇదేకవి పున్నయ్య చౌదరి గారు రైతుకృషిని ప్రస్తావిస్తూ ఇలా అంటారు.

“వట్టిదికాదు నీ కృషి! ప్రపంచమునంగల వృత్తులన్నిటన్
దిట్టతనమ్ము కల్గినది! తీరని కష్టములొందు నిన్ను కన్పెట్టి
సహాయమీయక ఉపేక్షవహించుట కల్పవృక్షమున్
కట్టెలకై వధించుకొను కారణమేకద రైతు సోదరా!”

★ ★ ★ ★ ★

**దువ్వూరి రామిరెడ్డి** (ప్రస్తుత శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరులో 1895లో జన్మించి 1947లో స్వర్గస్థులైన ప్రముఖ కవి, విమర్శకులు, న్యాయవాది, నాటకరచయిత, బహుభాషా కోవిదులైన ‘సింహపురి సిరి’, ‘రైతు కవి’, ‘కవికోకిల’ బిరుదాంకితులైన దువ్వూరి రామిరెడ్డి గారు) తాను వ్రాసిన ‘కృషీవలుడు’ అనే పద్యకావ్యంలో శ్రమైక రైతుజీవనం గురించి అద్భుత వర్ణనలు చేశారు. వాటిలో కొన్ని...

“కడ మొదలులేని నీ దేహకష్టములకు
ప్రతిఫలంబగు సస్యసంపత్తి గాంచి
కవివి గాకున్న వాగ్మిత గలుగకున్న
ప్రణతి వర్ణింపు మొకసారి భాగ్యగరిమ!”

(సస్య సంపదను చూచిన కవి ఉప్పొంగుతూ, కర్షకుని కూడా కవిని కమ్మంటూ తన ఆనందాతిరేకాన్ని వెల్లడించారు కవి దువ్వూరిగారు ఈ పద్యంలో)

మరో పద్యంలో....

**“పొలముల బీళులం దిరిగి ప్రొద్దెదగ్రుంకగ నిల్లుసేరి పా**
**పల నొడిచుట్టు బెట్టుకొని భార్యను నన్నము దెమ్మటంచు వే**
**పిలిచెద, వొంటి కాపురము, పిల్లల గిల్లల బుజ్జగించుకో**
**వలసిన యాలిపాటు దలపం కరుణింప వదేల హాలికా!”**

(గృహకృత్యాలతో, పిల్లలతో సతమతమవుతున్న భార్య కష్టాన్ని తలంచక, తనకు వడ్డించమంటూ ఆత్ర పెడ్తున్న యువకుడిని చూస్తూ, భార్యపై కొంత అనురాగంతో కూడిన దయను చూపమంటూ సుతిమెత్తగా హెచ్చరిస్తున్నాడు కవి)

★ ★ ★ ★ ★

## తుమ్మల సీతారామమూర్తి చౌదరి

(1901లో గుంటూరు జిల్లాలో ‘కావూరు’ అనే గ్రామంలో జన్మించి, 1990లో ‘అప్పికట్ల’ అనే గ్రామంలో అస్తమించిన ఆధునిక పద్యకవుల్లో అగ్రగణ్యుడు, జాతీయోద్యమ కవి, పండితుడు, బహుగ్రంథ రచయిత, ‘అభినవ తిక్కన’, ‘తెనుగు లెంక’ , ‘మహాత్ముని ఆస్థానకవి’ బిరుదాంకితులు, కళాప్రపూర్ణ తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారు) రైతుకు హితవు పల్కుతూ....

**“పరధర్మముల మెచ్చి పరువులెత్తెద వేల**
**కోటివిద్యలు కొంగ్రసాటి యగునె**
**పట్టణంబుల జూచి లొట్టవైచద వేల**
**తల్లికౌగిలి గదా పల్లెటూరు**
**కొంప నిల్వున గూల్చు కోర్టులంపట యేల**
**దిద్దుతీర్పరి లేడే పెద్దకాపు**
**బక్కరైతును ద్రొక్కిపట్ట జూచెద వేల**
**మేలోర్వ కెవ్వాడు కోలుకొనియె**
**కలవరించెద వేల శుల్కంబు కొరకు**
**విషకణం బది నీదు జీవితపు సుధకు**
**సడలిపోయిన శీలంబు సంతరించి**
**కీర్తిగనవయ్య భారతక్షేత్రజీవి!”**

**!! జై కిసాన్!!     !జై జై కిసాన్!!**

# మట్టి మనిషినండి నేను... నా గోడు వినరండీ...



యడ్లపల్లి వేంకటేశ్వరరావు
పద్మశ్రీ పురస్కార గ్రహీత

ఎందరో మహానుభావులు.. అందరికీ వందనాలు.. వంద అణాలు కూడా కూడబెట్టుకోలేని నా రైతన్నకు శతకోటి వందనాలు... ప్రభువులు ప్రభుత్వాలు మారతాయి. నా రైతు బ్రతుకు మారదు. తన కాళ్ళకు పగుళ్ళైతే ఇసుమంతైనా పట్టించుకోని ఆ మట్టిమనిషి తన భూమిలో ఏర్పడిన పగుళ్ళకు గుండె బద్దలై ఆకాశం వైపు చూస్తాడు. తన ఒంట్లో పుండు పుడితే రవ్వంతైనా ఖాతరు చేయని గట్టిమనిషి. తన పంటకు పురుగు పడితే విలవిలలాడిపోతాడు. అంతకన్నా ఏం చేస్తాడు... అప్పు చేసి కొన్న విత్తనాలు నకిలీ, కడుపు మాడ్చి కొన్న పురుగుమందు నకిలీ, సర్కారు వారిచ్చే ఎరువు నకిలీ. ఈ నకిలీ జీవితాలలో తాను బ్రతకలేకున్నాడు.. ఎందుకంటే తాను బ్రతకనేర్చినవాడు కానే కాడు. కుటుంబ పోషణ తలకు మించిన భారమని తెలిసి, రెక్కాడితే గానీ డొక్కాడదని తెలిసి, రోజూ కాయ కష్టంలోనే తన సుఖాన్ని వెతుక్కునే వ్యక్తి మన రైతు. తన భారాన్ని కుటుంబానికి కనబడనీయకుండా తన చిరునవ్వులతో కప్పేస్తాడు. తన శరీరంపై ఏర్పడ్డ గాయాలను మట్టితో కప్పేస్తాడు. సేదతీరే సమయం లేనివాడు రైతన్న. పట్టె మంచం ఎరుగడు, మట్టే తన మంచం, పచ్చగడ్డే పట్టుపరుపు.. పంటచేలో వచ్చే శబ్ధాలే తనకి జోలపాట.. తనకంటూ కోరికలేమున్నాయని, మేడలు మిద్దెలు కట్టాలనుకుండా? కార్లు విమానాల్లో తిరగాలనుకుంటాడా??

సమయానికి ఆకాశం వరుణించి, భూమాత కరుణించాలని కోరుకుంటాడు.. తన చేనుకిచ్చే విలువ తన మేనుకివ్వడు. ఎందరమో గొప్పవాళ్ళమయ్యాం. అందులో మన రైతన్నలు ఎందరున్నారు?? చిన్ననాటి నుండి కష్టపడి పైకొచ్చి స్థిరపడ్డవాళ్ళందరూ ఒక్కసారి ఆలోచించండి? రైతన్నకు ఆ స్థిరత్వం ఏనాటికైనా దక్కుతుందా?? రైతును ఈ శాశ్వత అస్థిరత్వం నుండి కాపాడేదెవరు? పల్లెటూళ్ళే పట్టుకొమ్మలు, రైతే వెన్నెముక.. ఈ నినాదం వచ్చాక ఎన్ని పల్లెలు పట్నాలయ్యాయో,

ఎందరు రైతుల వెన్నెముకలు విరిగాయో? రైతే రాజు అని నా దేశం చాటి చెప్పింది.. కానీ, ఆ రాజు నిజానికి దాసుడు.. ఔను మన రైతన్న దాసుడు.. ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్ళకు, దాసుకు దళారీల దోపిడీలను చెప్పుకోలేని బలహీనుడు.. ఒకవేళ పెదవి విప్పినా కడుపుకే చురకపడుతుంది..

పంట పండించడం ఒక కళ. కానీ తాను ఇది నా బాధ్యత అనుకుని చెయ్యడు. ఇది నా కర్తవ్యం అనుకుంటాడు. దళారీలు రైతన్నల దగ్గర బేరాలు పెడతారు, వారి చెప్పిన ధరకు పంటను అమ్మకానికి ఇవ్వడం కుదరదు అని చెప్తే తన సరుకును కొనకుండా బయటే ఉంచేయడమో లేక వచ్చే ఏడు పంట కొనకపోవడమో చేస్తారు.

నల్లనయ్య మన్ను తిన్నాక నోరు తెరవగా ఈ బ్రహ్మాండమంతా కనబడుతుంది.నిజానికి చిన్నికృష్ణుడు మట్టిలోనే సర్వం ఉందని చెప్పదలచాడేమో. అలాంటి మట్టిని నమ్ముకున్న రైతన్నకు మిగిలింది మట్టేనా? విదేశీ వ్యాపారులు కూడా మన దేశంలో ఎన్నో ఫెఫ్ ఫ్రాఫ్ట్ చేసి ధనవంతులయ్యారు.. ఇక్కడున్న మన రైతన్న ఇంకా రోజు ఎలా గడుస్తుందా అని ఆలోచిస్తున్నాడు. మన తిండిని పండించే రైతన్న ఏనాడైనా మూడుపూటలా తినగలుగుతున్నాడా? స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళైనా ఈ మట్టినినిషిని పట్టించుకున్నదెవరు?

తనకంటూ తగు సమయాన్ని కేటాయించుకోలేని దురదృష్టవంతుడు రైతన్న.. నిత్యమూ ఎండలో ఎండినా, వానలో తడిసినా, తన పాదాలకు ముళ్ళు ఎన్ని గుచ్చుకున్నా, కోత కోసేటపుడు చేతులకు ఎన్ని గాయాలైనా, ఇవన్నీ తనకు చాలా చిన్నవి. ఎందుకంటే తను పంట అనే తపస్సు చేస్తున్న యోగి పుంగవుడు. ఈ మట్టిమనిషి విలాసాల కులాసాలు ఎరుగడు. కళాశాలకు వెళ్ళిన వాడు కాదు. చదువు రాదని తనని తాను తిట్టుకుంటాడు. తన బిడ్డలకైనా చదువులు అబ్బాలని తాపత్రయ పడే మనిషి..

పొలాల నన్నీ, హలాల దున్నీ, ఇలాతలంలో హేమం పిండగ, జగానికంతా సౌఖ్యం నిండగ అని మహానుభావుడు శ్రీశ్రీ గారు చెప్పిన కవితలను గొప్పగా చెప్పుకోవడమే గానీ, ఈ ధరిత్రిని పాదాలతో తాకి చాలా ఏళ్ళైంది.. మట్టి పాదానికి తాకితే అదేదో పాపమన్నట్టుగా, మట్టికి మన పాదానికి ఉన్న బంధాన్ని చెప్పులు ఏనాడో కప్పేశాయి.. అప్పుడే పుట్టిన శిశువు పాదాలను తల్లి ముద్దాడినట్టు, తన

పాదాలను నిత్యం ముద్దాడుతుంది ఈ పుడమి తల్లి అని రైతన్నలు చెప్తారు. మనిషి నక్షత్ర మండలాలకు ప్రయాణం చేస్తున్నాడు, చంద్రమండలంలో భూములు ఇప్పుడే కొంటున్నాడు. కానీ, తాను నిలబడ్డ ప్రాంతంలో ఒకప్పుడు పంట సిరులు పండాయని, అది ఓ రైతన్న రెక్కల కష్టమని తెలుసుకోలేకపోతున్నాడు...

అయ్యా తాను అలా లేకపోతే మీ కడుపు నిండదని తెలుసుకోండి. నాటి మోతుబరుల దగ్గర నుంచి నేటి దళారుల వరకు ప్రతి ఒక్కరూ రైతు కష్టం మీద పైకొచ్చినవారే. అందుకే మన దేశంలో వైద్యుల పిల్లలు వైద్యులు, ఏ అర్హతా లేకపోయినా నాయకుల పిల్లలునాయకులు అవ్వాలనుకుంటున్నారు గానీ, రైతు బిడ్డలు రైతులుగా మారాలనుకోవడం లేదు. ఇందుకు చాలా కారణాలున్నాయి. వాటిని అధిగమించాలి రైతు అంటే చాల మందికి చులకన, వ్యవసాయం చేస్తున్నాను అంటే ఏ పనీ చేయడు అనే ముద్ర పడుతుందేమో అన్న భావన నేటి సమాజంలో బలంగా ఉంది. ఆ భావాన్ని సమూలంగా నాశనం చెయ్యాలి. జైకిసాన్ అంటూ ఎలుగెత్తాలి ఈ తరం. నేటి యువత అపోహలను వీడి వ్యవసాయానికి గట్టి పునాది వేయాలి. మట్టి మనిషే గట్టి మనిషి అని నిరూపించాలి. మహాభారతంలో బలరాముని ఆయుధం నాగలిగా చెప్పబడింది. ద్వాపరయుగంలో స్వయంగా వ్యవసాయం చేయడం గొప్ప పనిగా భావించేవారు. యుగాలు మారినా



భారతదేశంలో భూమాత పంట సిరులు కురిపించింది. పుట్టిన నాటి నుండి కడుపు నింపుకోవడమే గానీ దాచుకోవడం తెలియని అమాయకుడు మన రైతన్న.

లాక్ డౌన్ సమయంలో ఇంచుమించుగా అందరూ 'వర్క్ ఫ్రమ్ హోమ్' అని ఇంట వద్ద ఉంటూనే జాగ్రత్తగా సంపాదించుకున్నారు. వ్యాపారస్తులందరూ ఆన్ లైన్ బాట పట్టారు. సంపాదనా మార్గం పసిగట్టారు. మరి మన రైతన్నకు ఏదీ వర్క్ ఫ్రమ్ హోమ్. తను భూమికి పోకుంటే తనపైన అలుగుతుంది. అలుపన్నది లేకుండా కష్టపడితేనే పెట్టిన పెట్టుబడి కన్నా కొంతైనా లాభం ఉండేది. గుడికి వెళ్ళిన ఎవరైనా దేవుడా రైతు బాగుండాలి, అతనికి పంటలు బాగా పండాలి, వర్షాలు సమయానికి కురవాలి అని ఏనాడైనా కోరుకున్నారా? ఒకవేళ లేకపోతే ఇకనుంచి రైతు గురించి కూడా కోరుకోండి. మకుటాలు లేని మహారాజులైన రైతులు బాగుంటేనే దేశం బాగుంటుంది. తనకు చదువు లేకపోవచ్చు, కానీ తనకు చేతిలో మంచి విద్య ఉంది. బీడు భూమిలో కూడా బంగారం పండించేంత విద్య ఉంది.

అందుకే "మకుటం లేని మహారాజైన మన రైతన్న పదుకుండవ అవతారం" నాగలి వచ్చీ రాగానే ఈ భూమిని చీల్చి పంటకు సాయం చేస్తుంది

**"రైతును కాపాడుకుందాం,**
**దేశాన్ని కాపాడుకుందాం.."**

పొలాలకు గౌరవం ఉంటేనే రైతుకు, సాగుకు విలువ. పొలాలకు విలువ పోయి కళ తప్పి, స్థలాలకు విలువ పెరిగే కొద్దీ సమాజం పతనం వైపు అడుగులు వేస్తున్నట్లు. ఇప్పుడు మన దేశమంతా ఇదే పరిస్థితి. భూమి పుత్రులుగా, నేల తల్లి బిడ్డలుగా అన్ని సంస్కృతులకు మూలమైన వ్యవసాయాన్ని బతికిస్తూ లాభసాటి వ్యాపకం చేద్దాం. చేయి చేయి కలుపుదాం. ముందుకు సాగుదాం.

**యడ్లపల్లి వేంకటేశ్వరరావు**
**పద్మశ్రీ పురస్కార గ్రహీత**
ఛైర్మన్, రైతునేస్తం ఫౌండేషన్
ఫోన్: 9490559999

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | రైతు పరబ్రహ్మ స్వరూపి | - శ్రీ దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి | 20 |
| 2. | వడగండ్ల వాన | - శ్రీ మంత్రి కృష్ణమోహన్ | 22 |
| 3. | అతగాడు పొలానికి బయలెల్లేయేల... | - శ్రీ పాయల మురళీకృష్ణ | 24 |
| 4. | మట్టి కిందకి | - శ్రీ నన్నపనేని రవి | 28 |
| 5. | ఓ రైతన్నా! మానవజాతి మనుగడకు.. | - డా. తలారి ఢాకన్న | 32 |
| 6. | అస్థిపంజరం | - శ్రీ చొక్కర తాతారావు | 36 |
| 7. | కార్షక మహర్షి | - శ్రీ రాం డొక్కా | 40 |
| 8. | అనాది ప్రేమికుడు | - శ్రీమతి దొండపాటి నాగజ్యోతి శేఖర్ | 42 |
| 9. | అమ్మ రైతు | - శ్రీ ర్యాలి ప్రసాద్ | 44 |
| 10. | ధరణిసుతుడే దారిదీపం | - శ్రీమతి సాలిపల్లి మంగామణి - 'శ్రీమణి' | 48 |
| 11. | ఎదురీత | - శ్రీ సిరికి స్వామినాయుడు | 52 |
| 12. | దేశానికి వెన్నెముక | - శ్రీమతి తన్నీరు శశికళ | 56 |
| 13. | రైతే రాజా? | - చేబ్రోలు శశిబాల | 58 |
| 14. | నివేనిశి నందనా | - శ్రీమతి లలిత రామ్ | 62 |
| 15. | సంకేతం | - శ్రీ బాలసుధాకర్ మౌళి | 64 |
| 16. | మట్టిచేతుల మహాద్భుత చిత్రకారుడా... | - శ్రీ గంటేడ గౌరునాయుడు | 66 |
| 17. | పొద్దన్నే చీకటిపడింది | - శ్రీ కోసూరి రవికుమార్ | 70 |
| 18. | ఒరిగిన వరికంకు | - శ్రీ మార్ని జానకిరామ చౌదరి | 74 |
| 19. | రైతు ఉగాది రావాలి | - డా. బీరం సుందరరావు | 78 |
| 20. | సేద్యం - సువేద్యం | - డా. వేంకట నక్త రాజు | 82 |

| | | |
|---|---|---|
| 21. ఆకుదీసిన ఈనెలు | - శ్రీ బండ్ల మాధవరావు | 86 |
| 22. విశ్వ విజేతలు - హాలినీ హాలికులు | - డా. కొండపల్లి నీహారిణి | 88 |
| 23. ఆర్గానిక్ ఫ్లెక్సీ | - శ్రీమతి నారదభట్ల అరుణ | 94 |
| 24. ధ్వజస్థంభంలా | - శ్రీమతి పి. అమరజ్యోతి | 98 |
| 25. ఈ చరిత్రను కబ్జా చేయాల్సిందే! | - శ్రీ యార్లగడ్డ రాఘవేంద్రరావు | 100 |
| 26. రైతుదేవోభవ | - శ్రీ చిటిప్రోలు సుబ్బారావు | 104 |
| 27. రైతన్న | - డా. శ్రీరమ్య రావు | 106 |
| 28. ఓ రైతన్నా! జీవాధారం నీవేనన్నా! | - డా. శ్రీదేవి శ్రీకాంత్ | 108 |
| 29. నేలరేడు | - డా. భాస్కర్ కొంపెల్ల | 112 |
| 30. రైతు మనసు తెలుసుకున్నాను | - శ్రీ ఆది మోపిదేవి | 116 |
| 31. ఆకరి మాట | - డా. కె. గీత | 118 |
| 32. వలయం | - శ్రీ శ్రీధర్ రెడ్డి బిల్లా | 120 |





## శ్రీ దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి

*(యర్రఓబన్నపల్లె, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్)*

దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి గారి స్వస్థలం – ప్రకాశం జిల్లాలోని 'యర్ర ఓబన్న పల్లె'. ప్రభుత్వ ఉద్యోగిగా పదవీవిరమణ చేసిన ఎజ్రాశాస్త్రి గారి కలంనుండి ఇప్పటివరకు 'ఏరువాకై తిరిగిలేస్తా', 'పంచమాగ్ని', 'ఉత్తర', 'ఇంకెంత దూరం' లాంటి కవితా సంపుటాలు, 'నిప్పుల్లో నడిచే తప్పెట', 'కర్రముక్క' లాంటి – ధీర్ఘ కవితలు; "ఎర్ర ఓబన్నపల్లె", "ధనుస్సు", "చంద్రవంక" లాంటి నవలలు వెలువడ్డాయి.

# రైతు పరబ్రహ్మ స్వరూపి

శ్రీ దుగ్గినపల్లి ఎజ్రా శాస్త్రి

ఎత్తిన చేట ఎగరేసిన రైతుపతాక
తూరుపుగాలికి తూర్పారబడుతున్న
ఆకలి తెలిసిన మనిషి!
ఆఖరి అవతార పురుషుడు!
రైతు, దేశానికి ఆకలి తీర్చువాడు.

చెమటోడ్చేవాడు చావుకు దగ్గరవుతుంటే
చెమటోడ్చని వాడు సర్వసుఖాలై
కాంక్రీట్ జంగిల్ లో ఏ.సి, గదిలో
భోగలాలసుడికి వద్దంటే
ఏ చెట్టుకు పండుతాయనే
కార్పోరేట్ కుర్రకుంకలు!!

"ధాన్యం కుప్పల్లో నుండే
ఉదయించే సూర్యుడు రైతు"!

దేశాభివృద్ధికి దిక్సూచి అని
తెలియనివాడు సిమెంట్
రోడ్డులా విస్తరించి పంటకాల్వను
మింగేస్తున్నాడు అమ్మబోతే
అడివి, కొనబోతే కొరివి !



రైతు బతుకు, ఆరు
బస్తాలు మూడు రూపాయలాయే!
ఆరుగాలం పంట ఏటిపాలయినట్టు.
రైతు పాలిటి దళారే తలారి!

పంట పొలాలన్నీ రియల్
ఎస్టేట్లు దుక్కి, బుక్కెడు
బువ్వకు భూమి కనుమరుగాయే
ఆకాశహార్మ్యాలలో నీవు,
అధఃపాతాళంలో రైతు

"బోరుబావిలో పడిన
పసివాడిలా ఊపిరాడక
ఆర్తనాధమవుతున్నాడు రైతు" !



## శ్రీ మంత్రి కృష్ణమోహన్

(మార్కాపురం, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్)

**స్వస్థలం:** ప్రకాశం జిల్లాలోని మార్కాపురం. తెలుగులో ఎం.ఏ పట్టా అందుకున్నారు. వృత్తిపరంగా ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్, పేరాలలో గణితశాస్త్ర ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు.

ఇప్పటివరకు కృష్ణమోహన్ గారి కలంనుండి 'మట్టి పలకలు' అనే నానీల సంపుటి; 'ప్రవహించే పాదాలు' అనే కవితా సంపుటి వెలువడ్డాయి.

అనేక సాహితీ సంస్థలనుండి సన్మానాలు, సత్కారాలతోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంనుండి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కారం అందుకున్నారు.

# వడగండ్ల వాన

శ్రీ మంత్రి కృష్ణమోహన్

అసలే అనంతపురం
కరువుబాధలు తాండవమాడే చోటు
నీటిజాడలు వెతుక్కోవాల్సిన తావు
కన్నీటికథలకు నెలవు
ఎపుడో కురుస్తాయి వర్షాలు
ఏమీ చెప్పకుండా
ఆకాశందయ మనిషిప్రాప్తం

ఉండుండీ కోరలు సాచింది మేఘం
ఉరుములూ, మెరుపులూ,
ఈదురుగాలులూ
వడగండ్ల వాన
జొన్నపంట, దబ్బచిక్కుడు,
ఉద్యానపంటలు
ధ్వంసం, ధ్వంసం
పూతరాలి కొమ్మలు మిగిలాయి
నిలువునా నేలకొరిగింది అరటి
వెన్నువిరిగి బావురుమంది బొప్పాయి

ఈ వేసవి మొదట్లో ఉగాదినాటికి
కాసింత పంట కంట
చూద్దామనుకున్నాడతడు
నిరాశే, నిరాశే
నెత్తీ, నోరూ బాదుకోక ఏం చేస్తాడు రైతు?
దిగాలుపడక ఏంచేస్తాడా నిస్సహాయుడు?
కళ్ళముందు, కలల్లోనూ అప్పుల దెయ్యాలు
బకాయీలు, బకాయీలు
చావే శరణ్యమనుకుంటే
ఆ తప్పు
ఆ తప్పు అతనిదేనా ?
పండగపూట కంచంముందు రైతు కన్నీరు
ఎవరికి శుభం? ఎవరికి పండుగ?
అతడి ఉగాదిపచ్చడి గిన్నెలో
ఉత్త చేదు మాత్రమే ఉందా!
అయ్యో !
తరతరాల ఏలికలకు దయలేదు సరే
ఈ ప్రకృతికేమయింది, ఏమయింది? ☆



## శ్రీ పాయల మురళీకృష్ణ

*(మెంటాడ, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్)*

విజయనగరం జిల్లాలోని 'మెంటాడ' గ్రామం ఈయన స్వస్థలం. వృత్తరీత్యా ఉపాధ్యాయుడు. 'అస్తిత్వం వైపు', 'గచ్చెంసెట్టుకి అటూ ఇటూ' అనే రెండు పుస్తకాలు ప్రచురించారు. అనేక స్థానిక, జాతీయ, అంతర్జాతీయ సాహిత్య సమావేశాలలో పాల్గొని ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

# అతగాడు పొలానికి బయలెల్లేయేల...

**శ్రీ పాయల మురళీకృష్ణ**

ఒరేయ్ అయ్యా
ఎవసాయం జూదమైపోనాదిరా
దేశమెల్లిపోయి కూలోనాలోచేసుకుంతే మేలు గదరా
ముంజూర్లో
దగ్గుతున్న నులకమంచం ఒకటే సొదపెడుతుంటాది

ఆరుగాలమూ
ఈ మట్టిశర్లంతో
పనిచేసీ చేసీ
మిగిలిందీ నేదు జరిగిందీ నేదు
నిన్నుచేసుకొని మట్టిపిసుక్కోవడమే తప్ప సుకమేనేదు..
సొమ్ముల దాణా నెత్తినెట్టుకొని కుతకుతలాడుతూ
కర్రలపొయ్యి నిప్పులు సిమ్ముతుంటాది

మంచి సదువూ సదివించకపోతివి
అరకొర జీతాల తుమ్మితే ఊడిపోయే పన్లోకి మమ్మల్ని తోసీసి
నువ్వింకా ఆ దిక్కుమాలిన ఎవసాయంనోకే దిగబడిపో
నిన్నెవడు బాగుసేత్తాడు..
అప్పుచేసి కొన్న లేపటాపు నగరంనుండి
పోన్లో నిట్టూరమాడుతుంటాది

అప్పులపాలై పోయి ఇంకా ఈ రైతు బతుకులోనే పొర్లాడ్డమెంది?
మానీసి ఏపారంలోకి దిగ్గాడదా
నాలుగు డబ్బులు మిగుల్తాయి
దారిలో ఎదురొచ్చిన తెల్లసొక్కాజోబీలో సులబంగా చేరిన
అయిదొందలనోటు ఎకసెక్కాలాడుతుంటాది

పొలంగట్టుకి అల్లంతదూరానున్న ఆరులైన్ల రోడ్డు
ఈ నడకని ఎప్పుడు మింగేద్దామాయని
కొండసిలవలాగ ఎదురుసూత్తుంటాది
అక్కడెక్కడో పీటం
అతడ్ని మరిసిపోయి సేనా ఏళ్లు గడిసిపోనాయి

అదునుకు పలకని ఆకాశానిది
ఎప్పుడూ ఒకటే తిత్తవ
అయినా అతడాగిపోనేదు

బతికినంతవరకు అతన్నడకాగదు
అతడ్నడకాగనంత వరకు
ఈ పెపంచానికే డోకా వుండదు
ఈ పెపంచానికే డోకా వుండదు. ☆




Gurdish



## శ్రీ నన్నపనేని రవి

*('ఉలిచి', ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్)*

*పుట్టింది ఒంగోలు మండలంలోని 'ఉలిచి' అనే గ్రామం. వృత్తిరీత్యా తెలుగు ఉపాధ్యాయుడు. గత రెండు దశాబ్దాలగా కవితలు రాస్తున్నారు. ఇప్పుటివరకు రాసిన 120 కవితలలో 12 కవితలు రైతు అంశ ప్రాధ్యాన్యంగా ఉన్నాయి.*

*సినిమాలకు కథారచయితగా పనిచెయ్యడం కూడా ఈయన వ్యాపకం. గతంలో 'క్రాక్' అనే సినిమాకు రచనా సహకారం అందించారు, ఇప్పుడు ఈయన పనిచేసిన 'దక్షిణ గిరి' అనే సినిమా త్వరలో విడుదల కాబోతుంది.*

# మట్టి కిందకి

**శ్రీ నన్నపనేని రవి**

తేళ్ళు, పాములు, కరెంట్ తీగలు...
ఎట్నుంచి వస్తుందో ఎత్తకపోవటానికి మిత్తవ
కల్తీలు నకిలీలు....
చావుకీ బతుక్కీ మధ్య మట్టి మనుషులు
మూగ పశువులు–

మీరంటున్నట్లు
పొలాన్ని వదిలేసి పరాయి పనిలోకి
అంత తేలిగ్గా పోవటమెట్లా ?
తలల మీదుగా తేలిపోయిన
తొలకరి వానమబ్బులెన్నో కరువు
కాలాలెన్నో
పస్తు పొద్దులెన్నో....

కాళ్ళలో ఆనెలూ ముళ్ళూ
కాయగాసిన చేతులు
కుంగిపోయి వంగి వంకర్లు తిరిగిన
మెడలూ నడుములూ....
చెమట ఫలాన్నీ చాకిరి ఫలితాన్నీ
దిగమింగి పోతున్న
మధ్యవర్తుల మాయగాళ్ళెందరో
దక్కుతుంది మాత్రం
కడగండ్లూ పుండ్లూ
కబేళాలకి తోలుకుంటున్న గొడ్డు గోదా...

అన్నం సృష్టికర్తల అప్పులకీ ఆత్మ హత్యలకీ
మీరూహిస్తున్నట్లు
ముతక చొక్కాలు ముతక పంచెల్లేని
క్రూరమూర్ఖుల వెర్రి సేద్యం కాదు
గట్టుమీద నిలబడ్డ పెట్టుబడుల
లేని పెద్దరికమూ కాదు
పొద్దు పొడవక ముందే
పట్నం వైపు పరుగులు తీస్తున్న పల్లెల
పనిలేనితనమూ కాదు...

మోసం
మట్టి మనుషుల మూకుమ్మడి మరణాలకి
కారణం మోసం–
శాసన కర్తల సంతకాల మోసం
గిట్టుబాటు ధరల్లేని గిడ్డంగుల మోసం
అసలు రహస్యం మాట్లాడని మొసలి
కన్నీరు మోసం
విత్తనాల నుంచి విశ్వవిపణి వీధులదాకా
విస్తరించిన వేయితలల తెల్ల రాకాసి
మోసం
తరాలుగా అదే మోసం
అదే మాయ....

మిత్తికీ విపత్తుకీ మధ్య
ఆడిన మాటకీ ఆత్మాభిమానానికీ మధ్య
ఇంటిగుట్టుకీ ఇవతల ప్రపంచానికీగ మధ్య
నడిచీ నడిచీ
నలిగిపోయి... నాలారిపోయి....
కాళ్ళూ నాగళ్ళూ
ముందుకి కదల్లేని కమతాలై
ఎద్దులూ ఏరువాకలూ ఏకాదశి పండుగలూ
గతించిన జ్ఞాపకాలై
వ్యవసాయం ఎచ్చులమారి ఎగతాళిమారి
పంచాంగమై
ప్రభువుల పరిహాస వ్యవహారమై
తలచినవన్నీ తారుమారై
తలకిందులై
తలగుడ్డలు నేల బడిపోయినప్పుడు......
కాడినీ మేడినీ
కన్నబిడ్డల కలల వరదగుడుల్నీ
కట్టుకున్న అభాగ్యురాళ్ళ నెత్తిన మోపుతూ...
నేల చూపులు చూస్తూ
మట్టి మనుషులు మట్టికిందకి వెళ్తూ
మట్టిలో కలిసిపోతూ...

ఆత్మరక్షణ కోసం
నోరులేని జీవులు కుట్టాయో కరిచాయో
ఇక్కడ
మాట్లాడే మనుషులే
వొర్తి మాటల్తో తెల్లార్చే మనుషులే
తెలిసిన మనుషులే తెలివైన మనుషులే
ఎండమావి పథకాలూ
ఎసరూ బియ్యమూలేని ప్రణాళికలూ
రచిస్తున్న మనుషులే
జనం మెదల మీదెక్కి నిద్ర నటిస్తున్న
మనుషులే
మట్టి మనుషుల్ని కాటేసిపోతూ
కడతేర్చిపోతూ
కాలం మీదకి నెపం నెట్టేసి పోతూ...

★ ★ ★

కల
చానా పాత కల
పాతన్నల పాత కల
పొలాలు బైటాయిస్తున్నట్లు కల
హలాలు తిరగ బడుతున్నట్లు కల
కర్రులూ కొడవళ్ళూ కన్నెర్రజేస్తున్నట్లు కల
గుప్పిళ్ళు పిడికిళ్ళై పైకిలేస్తున్నట్లు కల
పనిముట్లు ఆయుధాలైనట్లు కల
భూ బకాసురులు
భూస్థాపితమవుతున్నట్లు కల...

కల నిజమవ్వాలి కల నెరవేరాలి
ఉరితాళ్ళూ ఉసురు తీసిన హంతకులు
దగ్ధమవ్వాలి
మట్టి మనిషి మిక్కిలి గట్టి పిండమనీ
మానవజాతి మనుగడకి మూలాధారమైన
మనిషనీ
లోకమంతా శ్లాగించాలి
ప్రపంచమంతా నమస్కరించాలి
జై కిసాన్!
జయహో కిసాన్!! ☆





## డా. తలారి ధాకన్న

*(అక్నాపూర్, వికారాబాద్ జిల్లా, తెలంగాణ)*

డా. తలారి ధాకన్న గారి జన్మస్థలం: వికారాబాద్ జిల్లాలోని అక్నాపూర్ గ్రామం. తెలుగులో ఎం.ఏ. పట్టభద్రులై "రంగారెడ్డి జిల్లా యక్షగానసాహిత్యం సమగ్రఅధ్యయనం" అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. వివిధ జాతీయ సెమినార్లలో వ్యాసాలు, వచనకవితలు మరియు పత్రసమర్పణలు చేశారు.

పది సంవత్సరాలపాటు డిగ్రీ కళాశాలల్లో తెలుగు అధ్యాపకునిగా పనిచేశారు. వీలున్నప్పుడల్లా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఇష్టపడే భాషాభిమాని, పద్యాలను రాగయుక్తంగా పాడడంలో నేర్పరి.

# ఓ రైతన్నా! మానవజాతి మనుగడకు మూలాధారం నీవేనన్నా

డా. తలారి ఢాకన్న

సుక్క పొద్దున లేసి, పొద్దు పొడవకముందే,
పొలం పనులకు జేరి పొద్దంత పనిజేసి,
హలము చేతబట్టి పొలమంత దున్నుతూ
చెమటచుక్కల వర్షంలో
విత్తనాలు జల్లుతావు
వరుణుడు కరుణిస్తే
నీ కళ్ళల్లో ఆనందం
నిరాకరిస్తే నిస్తేజం
మొలకెత్తిన నాటినుండి
పంట చేతికందేవరకు
నీ ఆశ .. నీ శ్వాస
నీ ధ్యాసంతయూ
పంట పొలాలే....
నవమాసాలు మోసిన తల్లిలా...
పుడమితల్లి పచ్చని పైరుపంట
పుడమి జనులకు జీవనాధారం.
ఎక్కడో దూరదేశాన జీవిస్తున్న పురజనులకు
సన్నబియ్యం పండించాలన్న నీ సంకల్పం
ఎన్నో నూతన వంగడాలకు శ్రీకారం.

అనాదిగా వస్తున్న సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులను ఏమారక
ఆధునికతను, అధునాతన పద్ధతులను ఒడిసిపట్టి
ప్రజలకు పట్టెడన్నం పెట్టాలనే నీ తపన గొప్పది.

కాలం కన్నెర్ర జేసినా
ఆరుగాలం కష్టించి
పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోయినా
గుండెనిబ్బరంతో
కన్నీటిని కనురెప్పలమాటున దాచుకొని
కష్టాలకు ఎదురీదుతూనే ఉంటావు.
ఓ రైతన్నా!
నిజంగా మానవ జాతి మనుగడకు మూలాధారం నీ వేనన్నా!!

రాతి యుగం నుండి రాకెట్ యుగం వరకు
మనిషి ఎంత ఎత్తుకి ఎదిగినా... సృష్టికి ప్రతిసృష్టి గావించినా
మనిషి మనుగడకు మూలం రైతన్న.
రైతన్న లేనిదే రాజ్యాలు లేవు
భోగభాగ్యాలు లేవు.
మానవ మనుగడ కొనసాగాలన్నా
నాలుగు మెతుకులు తినాలన్నా
రైతు అహర్నిశలు కష్టపడి పనిచేస్తేనే........
అనునిత్యం పొలంబాట
పండుగనాడొంటిపూట
పట్టుబట్ట ఎరుగవు
పంచెబట్టలుంటే చాలు
పట్టెమంచం జాడ తెలియదు
జొన్నచేలో మంచె నొదలవు
దున్నినెర్రని దుక్కిలోనే
ఆదమరిచి కునుకు తీస్తవు
ఏరొక్క పున్నమి తప్ప
తీరొక్క రుచుల జాడ తెలియదు..
మనిషి చూస్తే మొరటుతనం
మనుసు చూస్తే మంచితనం.
ఓ రైతన్నా! మానవజాతి మనుగడకు మూలాధారం నీవేనన్నా!! ☆





## శ్రీ చొక్కర తాతారావు

(విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్)

కవి, రచయితగా ప్రసిద్ధులైన చొక్కరతాతారావు విశాఖపట్నంలో 'కేంద్ర సముద్ర మత్స్య పరిశోధనాసంస్థలో' సైంటిఫిక్ ఆఫీసర్‌గా పదవీ విరమణ చేశారు. ఇప్పటివరకు 1,000కి పైగా కవితలు, 130 కథలు, 10 నాటికలు, 30 వ్యాసాలు, 40 గేయాలు రాశారు.

వీరి కవితలు, కథలు, గేయాలు, వ్యాసాలు వివిధ పత్రికల్లో ముద్రించబడ్డాయి, ఆకాశవాణి ద్వారా ప్రసారమయ్యాయి. తానా పురస్కారంతో సహా అనేక సాహితీ సంస్థలనుండి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. 'సాహో' మాసపత్రికకు సహసంపాదకునిగా వ్యవహరిస్తున్నారు.

# అస్థిపంజరం

శ్రీ చొక్కర తాతారావు

చుట్టు వేల ఆవకాశాలున్నా
వేళకు నేలకు రాలని నీటిచుక్క కోసం
వెన్నులో కన్నీళ్ళు దిగమింగుకుని
ఇవాళ రైతు మోకాళ్ళమీద నిలబడ్డాడు
ఆరుగాలం కష్టించే రైతుకు
వ్యవసాయం గుదిబండగా మారి
ఆరుబయట దిక్కులు చూస్తున్నాడు!

నాట్లు వేశాక వర్షాలు పడక
మన నోట్లో ముద్దవడంకోసం
రైతు మట్టిపొరల్లో కలిసిపోతున్నాడు
పంట చేతికొచ్చాక గిట్టుబాటుధర లేక
దళారుల చేతుల్లో విలవిలలాడుతున్నాడు!
అమ్మబోతే అడవి కొనబోతే కొరివి
రైతు పరిస్థితి

చెమట నారుగా పోసి నరాలు వేళ్ళుగా చేసి
ఏటికేడాది ఏ పంట కోసమైతే ఎదురు చూశాడో
ఆ పంట వరద పాలైనప్పుడు
రైతుకంట కన్నీళ్ళే మిగిలాయి!
పొలం వెళ్ళే రైతు ఎప్పుడు తిరిగొస్తాడోనని
ఏ పురుగుమందు ఎప్పుడు తాగేస్తాడోనని
ఎదురుచూపులతో కుటుంబమంతా భయపడుతోంది!

దేశానికి అన్నం పెట్టే రైతు
ఇవాళ పనికిరాని వస్తువైపోయాడు

ఆకాశపు దొరువు నిండా నీళ్ళుంటాయని
మట్టిగూటిలో తొలకరి విత్తనాలు
మోరలెత్తి పైకి తొంగిచూస్తాయని
ఇప్పటికీ రైతు మనసులో ఏదో ఆశ!
రియలెస్టేట్ సంస్థలు దేశం మీదకు ఎగబడ్డాక
పచ్చని పంటపొలాలు కాంక్రీట్ జంగిళ్ళుగా
మారుతున్నాయి
మట్టిమీద మెతుకులు మొలకెత్తనివ్వకుండా
మట్టిని బంగారం చేసేశాం
మట్టి ఎప్పుడూ బంగారమే
ఒకసారి మట్టి చేజారిపోతే
బంగారం పోసినా మట్టిని కొనలేం!
రైతును మట్టిలోకి తొక్కేసిన పాలకులున్నంత కాలం

ఈ దేశంలో రైతుదేహం ఓ అస్థిపంజరమే!
పంటభూములు ఐటీ బూమ్ లుగా మారకముందే
రైతు దేహానికి కొత్త రక్తం ఎక్కించాలి
ఈ దేశముఖచిత్రం మీద రైతు అస్తిత్వం నిలపాలి!
ఈ లోకంలో శాశ్వతనిధి ఏదైనా ఉందంటే అది మట్టే
మట్టిని మనం కాపాడుకుందాం
మట్టిమీద నగరాలు మొలిచినప్పుడు కాదు
మట్టిమీద రైతు నడిచినప్పుడే మట్టి విలువ
పెరిగేది ☆





## శ్రీ రాం డొక్కా

(ఆస్టిన్, అమెరికా)

తెలుగు భాషాభిమాని, పద్య, వచన కవితారాధకుడు. 25 సంవత్సరాలగా అమెరికాలో టెక్సాస్ రాష్ట్ర రాజధాని ఆస్టిన్ నగర నివాసి. భాషాబోధన, సాహిత్యవేదికలు, సదస్సుల నిర్వహణ, అవధాన సంచాలకత్వం, ఆద్వైతతత్త్వ విచారణ ప్రవృత్తి. **వృత్తిపరంగా:** ఐటి-ప్రాజెక్టు మేనేజిమెంటు.

తెలియనిది తెలుసుకోవడం, తెలిసినది వ్రాసుకోవడం ఈయనకు సంతృప్తినిచ్చే వ్యాపకం. ఇప్పటికి రాం గారి కలంనుండి నాలుగు వచనకవితా సంకలనాలు, ఐదు పద్య శతకాలు, నాలుగు పద్య కవితా సంపుటాలు వెలుగు చూశాయి.

# కార్షక మహర్షి

శ్రీ రాం డొక్కా

అసలు జీవితం
ఆకలితోనే కదా ఆరంభం.
ఆకలి తీరాకే
అమ్మైనా, నాన్నైనా.
ఆకలి తీర్చేవాడే
అమ్మైనా, నాన్నైనా.

మెతుకు లేనిదే
బ్రతుకే లేదు,
విత్తు లేనిదే
పంటే లేదు.

నీవు చేసేది
వ్యవసాయం కాదు,
మానవాళికి
జీవన దానం.

ఆకలిని తీర్చే
మహాయజ్ఞంలో
నీవే ద్రష్టవు, నీవే హోతవు.

మనుగడను శాసించే
మహాకావ్యానికి
నీవే కవివి, నీవే శ్రోతవు.

నీకు కావలసినంత మాత్రమే
పండించుకుంటానని,
నీ శ్రమ ఫలితమంతా నీదేనని,
ఏనాడూ హఠం చేయని
మహంతివి.

నీవందించిన ఫలాలు
కళ్ళముందే కాకులెత్తుకుపోతున్నా,
కాలి బూడిదౌతున్నా,
కాలాన్ని, కర్మను, కర్తవ్యాన్ని నమ్ముకున్న
వేదాంతివి.

నీ హృదయం
మమతానురాగాల సుక్షేత్రం.
నీ జీవనం
ప్రకృతితో మమేకం.
నీ స్వేదం
జనచైతన్యానికి మూలాధారం.
నీ త్యాగం
భావితరాలకు శంఖారావం.

ఓ కార్షక మహర్షీ!
ఆకలికి ఆవురావురుమంటున్నప్పుడో,
వడ్డించినది ఆకులోనే వదిలేసినప్పుడో,
నువ్వు జ్ఞాపకంరాక మానవు, కానీ,
అనుదినం నిన్ను స్మరించుకోవాలి
నువ్వే జగతికి ప్రాణదాతవు. ☆







## శ్రీమతి డి. నాగజ్యోతి శేఖర్

*(మురమళ్ళ, కోనసీమ జిల్లా, ఆంధ్రప్రదేశ్)*

*దొండపాటి నాగజ్యోతి శేఖర్ వృత్తిరీత్యా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలు. కథలు, కవితలు వ్రాయడం వీరి ప్రవృత్తి. కథలు, కవితలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం నుండి ప్రసారమయ్యాయి. పలు అంతర్జాతీయ పోటీలలో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. 'రెప్పవాల్చని స్వప్నం' (2021) అనే తొలి కవితా సంపుటికి సిరికోన అకాడెమీ వారి శ్రీమతి జింకా రుక్మిణమ్మ స్మారక పురస్కారం, 2023 పొందారు.*

# అనాది ప్రేమికుడు

శ్రీమతి దొండపాటి నాగజ్యోతి శేఖర్

అతడికి ఆకలితో అనాది పరిచయం
ఖాళీ పేగులు రాసే కవితలతో అంతులేని అనుబంధం
చీకట్లను దున్ని వెలుగుల్ని పండించడం అతనికి మట్టితో పెట్టిన విద్య

లోకమంత విస్తరి కుట్టాలని
వేళ్ళను బొబ్బలెక్కిస్తాడు
ప్రపంచమంతా పచ్చగా చేయాలని కాళ్ళను వేళ్ళను చేసి బురదలో మొలిచే చెట్టు అవుతాడు

పొలంగట్లను దీపావళి చేసి
అప్పుల అమావాస్యను తను మిగుల్చుకుంటాడు
దిగుడు బావిలో నీటిని పైరు పిల్లల నోటికందించి
దాహం తీరని ధరల చినుకులతో
గొంతు తడుపుకుంటాడు
ఎందరికో కథావస్తువు తనైనా
తన కన్నీటి కథలన్నీ ఒంటరి పొలంలో విత్తుల్లా చల్లుతాడు
తన కష్టాన్ని తనే నూర్చుకొని
రోట్లో నలిగే వడ్లగింజవుతాడు

అన్ని ఋతువులూ అతనికి శ్రమలనే కానుకిస్తాయి
పండుగలన్నీ అతనికి అకాల వర్షాలు
ఒక్క సంక్రాంతి కోసం మాత్రం అతడు ఆత్రంగా ఎదురు చూస్తూ ఉంటాడు.
ధాన్యలక్ష్మిని ఇంటికి తరలించి
కూతుర్ని పుట్టింటికి తీసుకొచ్చిన తండ్రిలా సంబరపడతాడు.

అతనికి సంక్రాంతి అంటే మహా ఇష్టం
అందరి నోట్లో అన్నమవ్వడమే అతనికి యుగాలుగా పరిచయమున్న సంక్రాంతి!
ఆకలికి అనాది ప్రేమికుడతడు!

☆



## శ్రీ ర్యాలి ప్రసాద్

*(కాకినాడ, ఆంధ్రప్రదేశ్)*

ర్యాలి ప్రసాద్ గారి జన్మస్థలం పిఠాపురం. వృత్తి రీత్యా బి. ఇడి కళాశాలలో అధ్యాపకులు. ప్రవృత్తి రీత్యా కవి, అవధాని. కవిగా ఇప్పటివరకు వీరు 23 కవితా సంపుటాలను ముద్రించారు.

అవధానిగా - వచనకవిత్వంలో అవధాన ప్రక్రియ ప్రారంభించి - 'దశావధానం', 'శతావధానం', 'సహస్రావధానం' చేశారు.

# అమ్మరైతు

**శ్రీ ర్యాలి ప్రసాద్**

ప్రపంచంలో అందరూ అన్నీ చూసినా
కడుపులోని ఆకలిని చూసేది అమ్మ తర్వాత అతనే !
ఏనాడూ తన కడుపు వైపు చూసుకోక
అందరి ఆకలినీ తీర్చాలనుకుంటాడు

సిలబస్లో లేని పాఠాలతో నిత్యపరీక్షలోని ప్రశ్నాపత్రాల్లాంటి
వర్తమాన క్షణాల్ని అత్తెసరు మార్కులైనా లేకుండా
ఎలా దాటేది?
కళ్ళమీది రెప్పలు కరువు చీకటైనప్పుడు
ఎండిన బావిలాంటి నదిని చూస్తూ
నిత్యం శవపరీక్షకు సిద్ధమవుతూనే ఉంటాడు

అతని కళ్ళలో ఆకాశాలు కొలువై మేఘాల కోసం
అవి కార్చే నాలుగు చినుకుల కోసం
ఆకాశదారులంట మేఘమధనాలు చేస్తాడు.

పిడికెడు బువ్వ పుట్టించడం కోసం
భార్య పుస్తెల్ని పసుపు కొమ్ముల్ని చేస్తాడు.
తెల్లకాగితంలాంటి అతని బతుకు చిత్రం
ఎప్పటికీ అంకెల గారడీకి అందని శ్వేతపత్రం

ఏళ్ళకేళ్ళు ఎండిన పైరులా మారినా వరమివ్వని ప్రకృతిదేవతకు
బతుకంతా నమస్కరిస్తూనే ఉంటాడు
మట్టి అతని శాశ్వత చిరునామా
లోకం వెనుక వైపు నుండి
చీకటి ముడి విప్పిన కిరణాలను సూర్యుడై
అన్నివైపులా పంచుతాడు.

దుక్కి దున్ని విత్తనాలు చల్లి దరువు వేసి
చెమటతో పంట పండించడం అతని వ్యసనం
మట్టిని చిత్తడిలా కలగనడమే అతని శ్వాస.
మట్టిని బతుకు గంధాన్ని చేసి
ఒంటికి పట్టించుకోవడం అతని సరదా

గింజ రూపం దాల్చి లోపల మెల్లగా పాలుపోసుకోవడంతో
అతని యజ్ఞం సాకారమవుతుంది
జవసత్వాల్లేక ఒట్టిపోయిన నేలకు పురుగు మందుల వైద్యం చేస్తాడు.
జానెడు పొడవు మొలకలతో దేశపు జెండాలా రెపరెపలాడే పైరు మధ్యలో
యింటి పెద్ద వరండాల్లో నిల్చునట్టు దర్జాగా నిలబడతాడు

మట్టి స్నానం చేసినవాడికి పొరలు పొరలుగా ఆవిష్కృతమవుతున్న
కలల దారాల చిక్కుముడి విప్పినట్లు
అపుడే పుట్టిన శిశువును మృదువుగా అరచేతుల్లోకి తీసుకున్నట్లు
అతి సుతారంగా పైరును గుండెలకు హత్తుకుంటాడు. ☆







## శ్రీమతి సాలిపల్లి మంగామణి

(విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్)

ఈమె కలం పేరు శ్రీమణి, విశాఖపట్నం నివాసి. అనేక దశాబ్దాలుగా అనేక రచనలు ముఖ్యంగా వేలాది కవితలు వ్రాశారు, వ్రాస్తున్నారు. ఈమె కలంనుండి వెలువడ్డ 1. చిగురాకులు, 2. కవితాంతరంగాలు 3. మణిదీపాలు అనే కవితా సంకలనాలు ముద్రించ బడ్డాయి. ఈమె "శ్రీమణి కవనసమీరం" అనే యూట్యూబ్ ఛానల్‌ను నిర్వహిస్తున్నారు. తానా కవితా ప్రతిభా పురస్కారాలతో సహా అనేక సాహితీ సంస్థలనుండి ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

# ధరణిసుతుడే దారిదీపం

శ్రీమతి సాలిపల్లి మంగామణి - 'శ్రీమణి'

రైతు మూలం
జగతి కోసం శ్రమజలాలను ధారపోసిన
ధరణిసుతుడే దారిదీపం
అహర్నిశలూ అవని సేవలో
పరిశ్రమించే అన్నదాతే ఆదిమూలం
బువ్వ పెట్టే భూమిపుత్రుని
ప్రతీ అడుగూ
పురోగమనం
ప్రగతి మార్గం
పైరు నడుమన
పరిశ్రమిస్తూ ఆలపించే ఆస్వేద గీతం
వేయి సూర్యుల సుప్రభాతం
వెలుతురతడే
వేకువతడే వెన్నుతట్టే వేలుపతడే
మేలుకొన్నది మొదలు వసుమతి
మేలుకోసం పరితపించే త్యాగధనుడే
రైతు నేస్తం, రైతు నేస్తం
శోకమంతా తను భరించి
లోకమంతా ముదము పంచే
కర్షకునిదే కష్టమంతా
చినుకు దారిని విచారిస్తూ
కునుకు మరచిన బడుగు జీవికి
పగలు లేదూ రాత్రి లేదు
నెర్రెలిచ్చిన పాదాల సాక్షి
పరితపించే కృషీవలునికి
ఫలితమన్నది దక్కలేదు

ఆరుగాలం అలసిసొలసి
అరకపట్టిన
త్యాగధనునికి
నరకయాతన ఏమిన్యాయం?
రోజంతా ఊడిగమే
గానుగెద్దు జీవితమై
మట్టిని నమ్మిన నీకు..
వెట్టిచాకిరీ మిగిలె
నీస్వేదం ధారపోసి..
సత్తువంత కూడదీసి
సేద్యం చేసిన నీకు..
వేదనే... వరమాయెనా?
చితికిన బ్రతుకుకు..
అతుకులు వేస్తూ
చితికి చితికి..
చితికి.. చేరువై
బ్రతుకుబండి లాగలేక
నీడొక్కలెండి పోయెనా?
పుట్టిన ఊరులో సైతం..
పట్టెడన్నం పుట్టక
పుట్టెడు అప్పుల పాలై.
పొట్ట చేత పట్టుకొని
తినడానికి తిండిలేక..
నిలుచుందుకు నీడలేక
ఏడ్వలేక, నవ్వలేక..

ఓదార్చేవారు లేక
నిర్లక్ష్యపు తావులలో
నీరెండిన కన్నులతో
అంతిమ పోరాటంలో
ఆత్మహత్యనే ఎంచుకు
నేల ఋణం త్రుంచుకు పోతున్నావా..
ఎవరున్నారయ్యా సామి!
పుడమిపైన నీ కన్నా..
మనసున్న ఆసామి
వెలగట్టగ తరమా ఏమి?
ప్రపంచాన్ని మోసేటి..
నీ కరముల కష్టాన్ని
అమ్మలాంటి నీ సేవకు
జన్మంతా ఋణపడాలి
ఆకాశమంటి నీ త్యాగానికి
జగమంతా ప్రణమిల్లాలి
రైతే రాజై విలసిల్లేటి
మునుపటి రోజులు మరలా కావాలి
వెతలే తాకని, వేదన సోకని
వేకువలే ఇకపై ఉదయించాలి
అపుడే కదా అసలు సిసలు
రైతుదినోత్సవం
అన్నదాత నవ్వితేనేగా
అవనికి కోటి దీపోత్సవం. ☆







## శ్రీ సిరికి స్వామినాయుడు

*(పార్వతీపురం, మన్యం జిల్లా, ఆంధ్రప్రదేశ్)*

సిరికి స్వామినాయుడు గారు అచ్చమైన కళింగాంధ్ర కవి. 'మంటిదివ్వ', 'మట్టిరంగు బొమ్మలు' అనే కవితాసంపుటాలలో కళింగాంధ్ర అస్తిత్వాన్ని, 'శతర' అనే కవితాసంపుటిలో ఆదివాసీ నేపధ్యాన్ని చక్కగా చిత్రీకరించారు.

రెండు దశాబ్దాలుగా నిబద్ధతతో కవిత్వం రాస్తున్న స్వామినాయుడు గారు అనేక సాహితీ సంస్థలనుండి ఎన్నో ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు.

# ఎదురీత

శ్రీ సిరికి స్వామినాయుడు

తరాల శోకానికి కొనసాగింపులా..
ఎప్పట్లానే ఆ రోజూ కోడి కూసింది
తూరుపుతూగుటుయ్యాలలోంచి సూరీడు లేవలేదు
నువ్వు లేచేవు
ఎప్పట్లానే ఆ రోజూ నాగలి భుజాన మోసుకొని
యుద్ధభూమికి బయలుదేరినట్టు పొలానికి బయలుదేరేవు
పోతూ.. పోతూ..
నిదురబోతున్న నెలవంకల నుదుటాకాశాలమీద
ఎడారిపెదాల ముద్రవేసీ ..
అదే ఆఖరిచూపన్నట్టు ఓసారి వెనక్కి తిరిగిజూసీ
గువ్వలు జాగ్రత్తని జెప్పి వెళ్లిపోయేవు
ఎర్రి మాలోకాన్ని .. కానుకోలేకపోయానా క్షణం ..
గేలానికి చిక్కుకున్న చేపపిల్లల్లా విలవిల్లాడే
నీ కళ్లలో తిరుగాడే గంగసుడుల్ని ..
పసిగట్ట లేకపోయాను పాపిష్టిదాన్ని
కంటిమీద కునుకుచినుకు రాలని ఆ రాత్రి
నిన్ను కోసిన కోటిరంపాల గుండెకోతల్ని ..
ఎప్పట్లానే .. ఆ సాయంత్రమూ
నీవొచ్చే దారిలో
చూపులదీపాలు వెలిగించుకొని ఎదురుజూసేను
పడమటకొండల్లో సూరీడు యింకిపోయేడు
నువ్వు రాలేదు
రాకాసిగబ్బిలమేదో రెక్కవిప్పినట్టు
చుట్టూ చీకటి కమ్మేసింది !

నువ్వు లేవు ..
నిదురగూటిలోంచి ఉలిక్కిపడిలేచిన గువ్వలు
'అయ్యేడీ'... అని అడుగుతూనే ఉన్నాయి
గంగడోలు దువ్వుతూ నువ్వు గుర్తొచ్చావేమో..
కట్టుదగ్గర మూగజీవాలు కన్నీరు కారుస్తూనే ఉన్నాయి
తనతో కలసిపాడే తోడేదని పిట్టా
తన ఒడిలో ఊసులుజెప్పే నీడేదని చెట్టూ
కలవరిస్తూనే ఉన్నాయి
నీవు లేవని ఎవరుజెప్పారో..
అరటితోట ఫెళ్లున విరిగిపోయింది
నీవు లేవని ఎవరు కబురిచ్చారో .. యేరు
హోరుహోరుమంటూ శోకధారగా ఏడుస్తూనే ఉంది
నీవిక రావనీ ఏ ఎండకాకి జెప్పిందో ..
గుండెపగిలిన భూమితల్లి బీడువారింది !

మూనిరుడు పండక
దంట్లైపోయిన పంటపొలాన్ని తగలబెట్టేవు
నిరుడు పండీ
గిట్టుబాటులేక రెక్కల కష్టాన్ని రోడ్లమీద పారబోసేవు
ఒకేడాది పంటకోసం
ఏటికేడాదీ బతుకును తాకట్టుపెట్టుకున్నావు
ఆదుకోవాల్సిన రాజ్యం
రైతుపక్షం కాదని తేలిపోయాక
ఎడారికళ్ల ఎదురుచూపు యింకెంతకాలమనుకున్నావో.. యేమో..
చెర తెంచుకొని పారిపోయేవు
పన్నాగాల పద్మవ్యూహంలో చిక్కి
పసరుటాకులా రాలిపోయేవు
దుర్భరమైనా..
పోరాడి నిలిచిన బతుకు చాలా గొప్పది కదా..!

నీకు గురుతుందా ..?
ఓనాడు తూరుపుదిక్కును చూపిస్తూ నిన్నడిగాను
పొద్దేమిటి ఎరుపుగా ఉందనీ ..
మనమారబోసిన మిరపకళ్లమన్నావు నువ్వు
బంతి పూలై విరిసిన కళ్లతో ..
మరోనాడు పడమటదిక్కును చూపిస్తూ
మళ్లీ అడిగాను
పొద్దేమిటి ఎరుపుగా ఉందనీ ..
మార్కెట్ మంటల్లో తగలబడుతున్న
మన బతుకులని జెప్పావు నువ్వు
ఎత్తిన కారం పిడికిళ్లతో ..
మరా తెగువ నీకేమైంది ?

రైతు పుటక పుట్టాక
మట్టితో పెనవేసుకున్న బొడ్డుపేగుబంధం
మధ్యలో తెగిపోదు
చచ్చేదాకా చాలుమీద నడవాల్సిందే ..
రాహువు మింగేస్తుందని తెలిసినా
సూరీడు దూరకుండా ఉండిపోడు
గట్టు అడ్డంపడిందని కొండవాగు ఆగిపోదు
ఎల్లకాలం ఎద్దు ఒకపక్కే తొంగుండిపోదు
ఆశ , ఒక ఎగిరిపోయిన పిట్ట
ఏనాటికైనా మళ్లీ మట్టికొమ్మలమీద వాలకపోదు
కమ్ముకున్న పొగమంచు కలకాలం ఉండిపోదు
కెరటాలకు తలవంచకుండా యేటికి ఎదురీదాల్సిందే
నాగళ్లమొనలమీద ఒక దేశాన్ని నిలబెట్టాల్సిందే ..!!



## శ్రీమతి తన్నీరు శశికళ

(నాయుడుపేట, ఆంధ్రప్రదేశ్)

ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో గణితం బోధిస్తున్నారు. విద్యార్థినులకు గత 15 ఏళ్లుగా కవిత, కథలు వ్రాయడంలో శిక్షణఇచ్చి, వారు వ్రాసిన రచనలను పత్రికలకు పంపడం, పుస్తకాలుగా ముద్రించడం చేస్తున్నారు. స్వతహాగా శశికళ గారు వ్రాసిన అనేక కథలు, కవితలు ఎన్నో పత్రికలలో ముద్రించబడ్డాయి, ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారం కాబడ్డాయి. అనేక సాహితీ సంస్థలనుండి సాహిత్య పురస్కారాలతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న ఉపాధ్యాయురాలు, రచయిత, వ్యంగ చిత్రకారిణి.

# దేశానికి వెన్నెముక

శ్రీమతి తన్నీరు శశికళ

అతను గుర్తుకు వస్తే పచ్చటి పంట పొలం కళ్ళ ముందు నడిచినట్లు ఉంటుంది.
మబ్బులతో పందెం వేసి కష్టాన్ని పావులుగా మార్చి జూదం ఆడుతాడు.
గెలిచిన గెలుపులు అన్నీ ఒక్క కరువు వచ్చి ఓడించేస్తుంది.
గ్యాంబ్లింగ్, మార్కెటింగ్ మాయాజాలాలు తెలీని వ్యాపారస్తుడు.
తన శ్రమే మొదటి పెట్టుబడి.
ఎండ, వాన, చలి అతనిని నిమురుతూనే కాలచక్రాన్ని తిప్పుతాయి.
విత్తనాలు రెండు పచ్చటి చిగుర్లుగా విప్పుకుంటే ప్రసవవేదన దాటిన తల్లిగా మురిసిపోతాడు.
చెట్టు, పుట్ట, మబ్బు, వాగు, హలం, పొలం,
ఆవు, ఎద్దు, పేడ, పిడక, గడ్డి, గాదం తనకు తోడువచ్చేవన్నీ తన దైవాలు.
విషం చిందే పామునైనా పక్కకు తప్పుకోమని వేడుకోళ్ళు.
విషపు పాము కనికరిస్తుంది కానీ వడ్డీ పాము విషాన్ని నింపుకుంటూ పెరుగుతూ ఉంటుంది.
రాని కరెంట్కు రాత్రి పగలు వేటాడి,
వరి నాట్లకు నీరవుతాడు.
పాల కంకి రాగానే పాలిచ్చే తల్లిలా పొంగిపోతాడు.
కంకులు వేయగానే రెప్ప వాల్చక కాపాడే నాన్న అవుతాడు.
పగిలి పుండ్లు పడ్డ కాళ్ళు చేతులు ఆభరణాలు అనుకుంటాడు.
కళ్లెంలోకి వచ్చే ధాన్యమే నిత్యం అతని కలలో!
వచ్చిన ధాన్యం వడ్డీలకు పోతే కన్నీళ్లు ఒక్కటే ఇప్పుడు అతని తోడు.
మళ్లీ మళ్లీ మోసం చేస్తున్న వ్యవసాయానికి సాయం చేస్తుంటాడు.
ప్రతి కంచంలోని మొదటి ముద్ద అతని సుఖాన్ని కోరుకుంటూ ఆకలి యజ్ఞంలో ఆహుతి అవుతుంది.
అన్ని కడుపుల ఆకలి తీర్చిన అన్నదాత,
తనకు అప్పుఇచ్చే దాతకోసం వెతుకుతూ ఉంటాడు.
రైతు అన్న ప్రజల మనుగడ నీవే అన్న!



## శ్రీమతి చేబ్రోలు శశిబాల

(హైదరాబాద్, తెలంగాణ)

శశిబాల గారు సుప్రసిద్ధ రచయిత్రి, కవయిత్రి. ఈమె కలంనుండి ఇప్పటివరకు 3,000కు పైగా కవితలు, 600కు పైగా పాటలు, 1,000కు పైగా సన్మాన పత్రాలు, 200 మినీ వ్యాసాలు మరెన్నో కథలు, కథానికలు వెలువడ్డాయి.

2023లో ఫిలడెల్ఫియాలో జరిగిన తానా మహాసభలకు ప్రత్యేకఅతిథిగా ఆహ్వానం అందుకున్న శశిబాల గారు ఘనంగా సన్మానించబడ్డారు.

# రైతే రాజా?

శ్రీమతి చేబ్రోలు శశిబాల

ఏ దేశ ప్రగతికైనా రైతే ఆధారం.. అతడే జీవన మూలాధారం
హలాన్ని నమ్మి పొలాన్ని దున్నే బక్క చిక్కిన రైతన్నా..
భారతావని ప్రగతి పథానికి వెన్నెముకే నీవన్నా.
వాననక, ఎండనక, పగలనక, రేయనక
నిత్యం కృషీవలుడివై, కర్షకుడివై, శ్రామికుడవై...
శ్రమైక జీవన సౌందర్యానికి నగిషీలు చెక్కి, మెరుగులు దిద్దుతున్నావు.
చెమట బిందు సరాలను హారాలుగా అలంకరిస్తున్నావు.
పురోగతికి పూలబాట వేసి, దేశఖ్యాతికి కాంతి మయూఖ ప్రకాశనం కూర్చి
స్వర్ణ మకుటాన్ని ధరింపజేస్తున్నావు.
నీ కృషితో జాతి సుగతికి కప్పుర నీరాజనం సమర్పిస్తున్నావు.
అంతటి మహనీయుడవు నీవు....
అన్నదాతవు నీవు...
ఏమిటి నీ దీనస్థితి...
ధరణిమాత ముద్దుబిడ్డడా! మట్టితో చెలిమిని చేసే భూమిత్రుడా!
నీవులేని మానవజాతికి మనుగడ ఏదీ?
అందరి కడుపును నింపే నీకడుపు ఎండుతుందని,
కట్టుకున్న ఇల్లాలికి, నీవు కన్న సంతానానికి
ఒక్కపూట గంజి కూడా పంచలేకున్నావని,
భూమాతకు పచ్చ పైరు చీర కప్పే నీకు
వళ్ళుదాచగా చింకి పాతైనా లేదని ఎరుగకున్నారే!
కడుపునింపే దారి లేక, రూక దారి కాన రాక,
కరకు విధితో పోరాడలేక, వున్న ఊరిని వదలలేక,
పుణ్యభూమి, రత్నగర్భపై గడ్డితిని బ్రతకలేక,
జన్మను రాళ్ళ పాలు చేసి, నా కర్మభూమి అంటూ

నమ్ముకున్న తల్లి వడిలోనే ఆఖరిశ్వాస తీస్తూ
ఆశల పంట పండించి ఊతమివ్వాల్సిన మట్టిని
దుప్పటిగా కప్పుకొని భూమిలో తలదాచుకున్నావు
పుట్టించిన ఆ అమ్మ కడుపులోనే మళ్ళీ దూరావు
వచ్చే జన్మయినా హాయిగా వుండదా అన్న ఆశతో
పేదరైతు సమస్యలు ప్రభుత్వాన చర్చల వరకే
కర్షకుని వేదన నాయకుల శుష్క నివేదనల వరకే
పార్టీలలో పారేసే అన్నం.. మెతుకులేక రైతన్న ఆకలిపోరాటం
పంటచేలలో వికృతంగా మ్రోగుతున్న మరణమృదంగాలు
మన పొట్టలు నింపే నిర్భాగ్యుని ఆక్రోశాల శంఖారావాలు
పెరుగుతున్న పెట్టుబడులు, దళారీల దారుణాలు
పెరుగుతున్న రుణభారం, తరుగుతున్న అన్నపూర్ణ హస్తం
పొడారిపోతున్న ఆశలు, బ్రతుకున ఎడారి మరీచికలు
రైతు రుధిరాశ్రువులే తొలకరులై రాలితే
నిండేనా అమ్మ గోమాత మానసం, కురిసేనా క్షీరవర్షం
నీరు కురవని మబ్బుల దెసగా, తీరం దొరకని సంసార సాగరంలో
ఆశల వూతంతో ఈదుతూ సాగిపో రైతన్నా... నీ గమ్యం చేరుకో... ☆





## శ్రీమతి లలిత రామ్

*(ఆరెగాన్, అమెరికా)*

*లలిత రామ్ అమెరికాదేశంలో 'ఆరెగాన్' నగర నివాసి. "అవంతీ కల్యాణం" తెలుగు నవలతో కలం చేపట్టారు. 'మేఘ' అనే ఆంగ్ల నవల, తెలుగు, ఆంగ్ల కథలు, కవితలు, వ్యాసాలు వ్రాశారు.*

*2023లో దేవులపల్లి వారి "తిరుప్పావై" శ్రవ్య నాటికను ఆంగ్లంలో "The Champika Enchantment" అనే పేరుతో అనువదించారు.*

*ఫౌండేషన్ ఆరంభించి, పిల్లలకు "పెర్ఫార్మింగ్ ఆర్ట్స్" అవార్డ్స్ ఇవ్వడం, 250 కవయిత్రుల పుస్తకము, "కవితా మేఘమాల" ప్రచురణకు, 102 రచయితల "నవ వ్యాస మాలిక" అనే పుస్తకానికి ప్రతిపాదకురాలిగా బాధ్యత వహించారు.*

*"ప్రపంచ తెలుగు సమితి" వ్యవస్థాపకులలో ఒకరిగా తెలుగు సాహిత్య సమావేశాలు ఏర్పాటు చేశారు. లలితా రాం పలు పురస్కారాలు, బిరుదు పొందారు.*

# నివేనిశి నందనా

శ్రీమతి లలిత రామ్

అతడు పరమేశ్వరుడట, అది లోహయుగమట,
గంగావాహిని తీరాన ఆదియోగి తపస్సు మునిగెనట
ఆ తేజమున జనియించె ఒక మనుజుడు, పునీతుడు
హలమొక చేత, దుక్కికోల మరొక చేత, సీతమ్మకు తమ్ముడట,
పంటకాపు, పచ్చటి పొలముల రాజాధిరాజు
అతడే రైతన్న, మనసే వెన్న, వృత్తి కౌశల్యములో మిన్న!

శ్రేష్ఠ సంప్రదాయ యుగములో, యమునా నదీ ప్రాంతం
ఆకాశవీధుల ఉరుములు, మెరుపులు, గ్రీష్మ తాపం, దారుణం
తొణకడు, బెదరడు క్షేత్రకరుడు, అతడు కుటుంబి, సంఘజీవి
ఆశల విత్తనాలు జల్లి, ఎరువులనొసగి, మొక్కలకు,
మానులకు తల్లీ తండ్రీ అతడే, పిల్లగాలిలో తలలూపే పైరుపంటల
కలుపులుతీసె, అతడే రైతన్న, నడుమా సన్న! ముఖవైఖరి మిన్న!

అటు కొడవలి, ఇటు గసిక, విత్తులు కొట్టు వృషభం,
కూడి, నర్మదా నదీ మైదానాల చేరి, ఈ భూమి, నా భూమి,
ఉర్వరమా, ఉషారమా, పంకికలమా, దేవమాతృకమా
లెక్కపెట్టక, మధ్యయుగంనుండి నవ యుగాలవరకూ నవధాన్యాలు,
వ్యంజనములు, ఫలసంగ్రహాలు, తేనెలూరు వంటకాల రుచులకై
లోకానికి అందించి, ధన్యుడైన రైతన్నే మిన్న! రైతన్నే మిన్న!

కృష్ణ, తుంగభద్రల నడుమ నవనాయకుడు ఆధునిక సైరికుడు
కంప్యూటర్ ఫార్మింగ్, బయోటెక్నాలజీలలో అతనిది అందెవేసిన చేయి
ఆకుపచ్చటి క్రాంతి, జీవ సాంకేతిక జ్ఞానము అతని గురుతులు
సహకార సేద్యము, సంపూర్ణ, సహజ ఫలోత్పత్తి అతని గమ్యస్థానం
మానసిక పటుత్వం, స్వాభావిక సత్తువ, వీటికి మూలాధారం అతడే
ముందడుగు వెయ్యి రైతన్నా!
లోకానికి దీపం రైతన్నా! నిన్ను కాపాడు బాధ్యత మాదే రైతన్నా!



## శ్రీ బాలసుధాకర్ మౌళి

*('పోరాం', విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్)*

**బాలసుధాకర్ గారు పుట్టింది:** విజయనగరం జిల్లాలోని 'పోరాం' గ్రామం.

గర్భాంలో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. 2014లో 'ఎగరాల్సిన సమయం' అనే తొలి కవితా సంపుటితో ప్రారంభమైన ఈయన రచనా ప్రస్థానం – 'ఆకు కదలని చోట',' నీళ్లలోని చేప', 'భూమి పెదాలపై', 'దుఖపు వొరుపు', 'నిర్వేదస్థలం', 'అస్తిత్వ వాచకం', 'సంకలిత దుఃఖం', 'తరగతిగది స్వప్నం' మొదలైన కవితలు, దీర్ఘ కవితలు, కవితా సంపుటాలతో సాగుతోంది.

# సంకేతం

శ్రీ బాలసుధాకర్ మౌళి

వర్షం వస్తుంది
ప్రళయోద్విగ్న వర్షం
సన్నని ధారలా మొదలై
మహోద్వేగంతో ప్రవహించే వర్షం
భూమిని సస్యశ్యామలం చేసే
వర్షం
వర్షం వస్తుంది.

చేలగట్లు తెగి
పాయలు పాయలుగా
వర్షం చెమటై ఉప్పొంగుతుంది
కాల్వల నిండా చెరువుల నిండా
నేలతల్లి ప్రాణనాడులు నదుల నిండా
వర్షం వర్షం
వర్షం ఉప్పొంగుతుంది.

వర్షం స్వేదవర్షం
ఊళ్ళను దాటి పట్టణాలను దాటి
నగరాల రాతిస్తంభాల మీదుగా
ప్రవహిస్తూ ప్రవహిస్తూ
దేశమంతా అల్లుకుంటుంది
దేశం నడిబొడ్డున
ఏకధాటిగా కురుస్తుంది వర్షం
వర్షం వస్తుంది.

కోపోద్రిక్తమైన వర్షం
ఈదురుగాలితో
మహావృక్షాలను కూల్చినట్టే
రాజభవంతులను
రాచరిక చట్టాలను
సుఖశయ్యలను
ఈడ్చిఈడ్చి కొట్టే వర్షం
వర్షం వస్తుంది.

వర్షం తుఫానుగా
తుఫాను పెనుతుఫానుగా
పెనుతుఫాను ప్రళయంగా మారే
సంకేతాలు కనిపిస్తున్నాయి
వర్షం వర్షం
వర్షం వర్షం

ఏరోజో ఒక రోజు వర్షం ఆగుతుంది
తలకు తలపాగ చేతిలో నాగలి
తొలిపొద్దునే ముస్తాబవుతూ అతను
విత్తుతో దుక్కిటెద్ల ముందు
నిదానంగా ఆమె కాంతి బింబం
కళ్లల్లోకొచ్చి నిలుస్తుంది.
అప్పుడూ అతను
కళ్లమీద అరచేయిని అడ్డం పెట్టుకుని
మేఘాల పొదుగుల కోసం
ఆశగా ఆకాశం వైపే చూస్తాడు
అమాయకత్వం అనుకోకు
వర్షం తుఫాను పెనుతుఫాను ప్రళయం
అతను సృష్టించినవే
అతను తలచుకుంటే
తలపాగ జాతీయ జెండా అవుతుంది
నాగలి జాతీయ చిహ్నం అవుతుంది. ☆



## శ్రీ గంటేడ గౌరునాయుడు

(దళాయిపేట, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్)

కథ, కవిత్వం, పాట, పద్యం.... అన్ని ప్రక్రియల్ని సమర్థవంతంగా నిర్వహించగలిగిన గంటేడ గౌరునాయుడు మాష్టారు విజయనగరం జిల్లా, కొమరాడ మండలం, దళాయిపేట గ్రామంలో సోములమ్మ, సత్యం నాయుడు దంపతులకు మొదటి సంతానంగా 07.08.1954 తేదీన జన్మించారు.

'పాడుదమా స్వేచ్ఛాగీతం' గీత రచయితగా ఖ్యాతిగాంచిన మాష్టారు మంచి గాయకుడే

కాకుండా మంచి చిత్రకారుడు కూడా. 'స్నేహకళాసాహితి'ని స్థాపించి ఉత్తరాంధ్ర నుంచి ఎందరో కవుల్నీ, కథకుల్నీ తయారు చేసిన ఘనత మాష్టారిది. ఆయన నిర్వహించిన కథ, కవిత, పాటలు పలు పురస్కారాలు పొంది సాహితీ లోకంలో ఆయన స్థానాన్ని సుస్థిరం చేశాయి.

గిరిజన సంక్షేమ శాఖలో తెలుగు ఉపాధ్యాయుడుగా మూడు దశాబ్దాల పాటు సేవలందించి ప్రస్తుతం విశ్రాంత జీవితం గడుపుతున్న మాష్టారు ఇప్పటికీ సాహిత్య సృజనలో అవిశ్రాంతంగా కృషి చేస్తూనే వున్నారు.

# మట్టిచేతుల మహాద్భుత చిత్రకారుడా...

శ్రీ గంటేడ గౌరునాయుడు

పంటపొలంలో పనిచేసే ప్రతి రైతూ
చేయితిరిగిన చిత్రకారుడే అనిపిస్తాడు
ఓ రైతన్నా..!
నిన్ను మించిన చిత్రకారుడింకెవరుంటారు?,
ఆకాశంలోకి ఆశగా చూసే నీ కళ్ళలో
ఎన్నెన్ని భవిష్యత్తు చిత్రపటాలో !

మేడిపట్టి మడిలో పోసే నాగేటిచాళ్ళు
జిలుగు కుంచెతో కాన్వాసుమీద గీసే అర్థమయ్యీ కాని
తొలిగీతల ఒంపుల్లా ఉంటాయి.

దమ్ముమడిలో నొల్లతో ఎత్తుపల్లాలు సరిచేస్తుంటే
బొమ్మకు రంగులద్దుతున్నట్టే ఉంటుంది,
పారపట్టి గట్టు చెక్కుతుంటే
నీటిరంగుల చిత్రానికి నగిషీల బోర్డరు గీస్తున్నట్టే ఉంటుంది,

బొమ్మగీస్తూ ఆకలిదప్పులు మరిచిపోయే చిత్రకారుడికీ
పంటచేను గట్టుమీద నిలబడి కలల్లో తేలిపోయే నీకూ తేడా ఏమీ ఉండదు.
కలల ప్రపంచంనుండి బయటికొచ్చేక మార్కెట్ మాయాజాలపు
పద్మవ్యూహంలో అభిమన్యుడివే అవుతావు,

ఏ దేవుడు నీకీ కృషికళను నేర్పేడో గానీ
వర్షం బొమ్మను చిత్రించడంలోని మెళకువలు నేర్పలేదెందుకో?

వానకోసం ఎదురుచూస్తున్న చేను అసంపూర్ణ వర్ణచిత్రంలా దిగులు కలిగిస్తుంది.
మేఘాలవేపు ఆశగా చూసే రైతన్నా..
ఎండిన రంగులపేలెట్ మీద విరిగిన కుంచెలా అగుపిస్తుంటావు,
ఎదురుచూస్తున్న వాన నీ కళ్ళల్లో కురిసి నీటిరంగుల బొమ్మవై కరిగిపోతుంటావు,

కలల్లోనూ, పొలాల్లోనూ పచ్చరంగును మాత్రమే
చిత్రించుకునే నువ్వు
బ్రతుకుచిత్రం నిండా పులుముకున్నది నల్లరంగే కదా!

ధాన్యపుగింజల మీద మా అందరి బొమ్మల్నీ చిత్రించే
ఓ మట్టిచేతుల మహాద్భుత చిత్రకారుడా!
నీ బొమ్మను మాత్రం చిత్రించుకోలేకపోవడం ఎంత విషాదం !! ☆







## శ్రీ కోసూరి రవి కుమార్

(దాచేపల్లి, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్)

పల్నాడు జిల్లాలోని దాచేపల్లి. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. **ప్రవృత్తి:** కవిత్వం, కథా రచన. అ.ర.సం ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శిగా ఉన్నారు.

'బొడ్డుపేగు', 'కాలంతెరలు',' దాపల' వంటి కవితా సంపుటాలు; 'కథా ప్రకాశం', 'డిసెంబర్ పూలు' లాంటి కథా సంకలనాలలో ఈయన కలంనుండి జాలువారిన కథలు వెలువడ్డాయి. అనేక సాహిత్య సంస్థలనుండి పురస్కారాలు అందుకున్న రచయిత కోసూరి రవికుమార్.

# పొద్దన్నే చీకటిపడింది

శ్రీ కోసూరి రవికుమార్

చేదుపూల చెట్టు నీడన
వగలమారి పిట్టొకటి వాలింది.

రచ్చబండ మీద
తొలి ముగ్గు ఏసిన పొద్దు
సాయంత్రానికి సద్దుమణిగింది.

మంచుకు తడిసిన
మిరపపూత బరువై రాలినట్టు
పత్తిపూల మింద తూనీగ సుతారంగా
వాలినట్టు
కొత్త ఋతువు కొంగు బిగిస్తా ఉంది.

కాసిన కాయలెన్నో లెక్కతెలవడం లేదు
పిగిలిన పింజ లెన్నో బరువుకు రాటం
లేదు.

పట్టెల్లెక్కన కోసిన చేతులకు
కూలీకిందకు కారపన్నం మిగిలి

బలమ్మందూ పురుగుమందులూ
మిగిలిచ్చిన ప్రాంసరీనోటు
పొలికట్టె అయ్యి
పండిన పంటంతా ఊడ్చి
ఊరవతల నిలబెట్టిన బేరగాళ్ళ లారీల్లోకి
ఎత్తకపోయింది

పంట మార్పిడికి మనసొప్పదు

కడుపాత్రం ముందు ఉల్లిగెడ్డ, ఉప్పూ
కాన్రాదు.
తింటే పలావుదినాల
లేకుంటే పొస్తులుండాల

మట్టిని తడిమిన చేతులకు
మాచెడ్డ పట్టుదల

చేతులమీన, కాళ్ళమీన
తలకుజుట్టిన తువాలుమీన.
యాడాలేనంత నమ్మకం.

పండగపూట,
పరిగె ఏరకొచ్చి
కాయపత్తి కింద కేజీల్లెక్కన అమ్మి
పిల్లకు కొనక్కొచ్చిన పూలగౌను.
పిలగాడికి తెచ్చిచ్చిన కొత్త బొంగరం
సందువా పెట్లోంచి తీసి
ఏసుకొచ్చిన దాపుడుచొక్కా,
ఉక్కులు తెగినా పిన్నీసుతో కలగలిపిన
పరువూ,
బతుకు చెక్రాలకు ఎన్ని కందెనలో

ఏదీ మార్చుకోడానికి మనసొప్పదు.
మట్టిబతుకు ఉట్టికెక్కేదెప్పుడు
సొరగం దక్కేదెప్పుడు!?

సాయంత్రం గుళ్లోంచి
పొంతులు గారు మైకుమీంచి
చెప్పే ఆదాయమో, వెయమో
అస్సలు అర్ధంగాదు.

బుజమ్మీనకు కండవా ఉండటమే
ఇత్తనాలకు సొమ్ము దొరకడమే ఆదాయం

సచ్చీ సెడీ పండిచ్చిందంతా
పట్నపోడు పట్టకపోడమే వెయం

కౌలుకి సేలు దొరకటమే
రాజపూజ్జెం

సేను ఈటుబొయ్యేట్టు
మబ్బొంగక పోటమే అవమానం

కూరాకు తేలేక
ఎరగెడ్డ, ఉట్టెన్నం తినడమే
కందాయ ఫలాలు

అయ్యోరు
పెట్టే పచ్చడి తిని
మళ్ళీ ఆరు రుచులూ బతుకుల్లోకి
ఆహ్వానించి కట్టెగొట్టి ఏరువాకసాగడమే
అలవాటైన బతుకు

ఇది ఈ నేలమింద తరతరాలకు
రాసిపెట్టిన పంచాంగం.
పొద్దన్నే సీకటి బడటమే
రైతు బతుకుల్లో
ఇసిత్తరమైన కైత్వం. ☆







## శ్రీ మార్ని జానకిరామ చౌదరి

*(కాకినాడ, ఆంధ్రప్రదేశ్)*

***నివాసం:*** కాకినాడ. ***వృత్తి:*** వ్యాపారం. ***ప్రవృత్తి:*** సాహిత్య, సాంస్కృతిక, సామాజికసేవ. పురాతన నాణాలు, కరెన్సీనోట్ల సేకరణలో అగ్రగామిగా రాష్ట్రస్థాయి ప్రదర్శనలలో బంగారుపతకం సాధించారు. సాహితీ స్రవంతి, కాకినాడ శాఖకు అధ్యక్షునిగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

'తెలుగువెలుగు', 'నవ్య', 'సాహిత్యప్రస్థానం', 'మల్లెతీగ', 'సాహితీకిరణం', 'కవిసంధ్య' లాంటి పత్రికలతో పాటు ప్రముఖ దినపత్రికలన్నింటిలోనూ ఈయన వ్రాసిన వ్యాసాలు, కవితలు అనేకం ప్రచురించబడ్డాయి. పలు సాహితీ పురస్కారాలు అందుకున్నారు.

# ఒరిగిన వరికంకు

శ్రీ మార్ని జానకిరామ చౌదరి

అతడొక అలుపెరగని మార్తాండబింబం
లోకం ఆకలితీర్చే అమృతభాండం
నాగలికర్రుపై రాలుతున్న చెమటచుక్కలతో
నాగేటి చాళ్ళలో జీవనాదుల్ని నాటుతూ
పుడమి పొత్తిళ్ళలో విత్తుగా మారి
మన్నుని అన్నంగా మారుస్తాడు
మానవజాతి మనుగడకు మూలాధారమై నిలుస్తాడు.

ఎండిన నది గుండె కింద
కన్నీటి చెలమల్ని తవ్వుతూ
ఏరువాకై సాగుతాడు
బ్రతుకు మోడుల్ని చిగురిస్తాడు
మట్టి తంబురాను మీటుతూ...
ఆకుపచ్చని గీతాన్ని ఆలపించి
అన్నంముద్దకు హారతి పడతాడు
బువ్వపూలు పూయించి
లోకానికి పట్టెడన్నం పెట్టే
ఆ ఆకుపచ్చని చేతుల్ని
వసంతం కూడా శిశిరమై కాటేస్తుంటే
కాలం కన్నీటి బొట్లుగా కరుగుతోంది
ఒక్క చినుకైనా రాల్చని మేఘం
ఆకాశాన దోబూచులాడుతోంటే..
మట్టిభాష తెలిసిన గుండె
దగ్ధగీతమై మండుతోంది


అరిగిన చెప్పుల్లోంచి
పొడుచుకొచ్చిన తుమ్మముళ్ళు
పాదాలకు పారాణి పూస్తుంటే...
కంట జారిన నీటిచుక్క
పగుళ్లు దీసిన మట్టిలో
మొలక కోసం వెదుకుతోంది.

బండల్ని పిండిచేసినా చెరగని రేఖలు
వేలిముద్రలై అరుగుతుంటే
నాటువేసిన నకిలీ విత్తు
దుఃఖపు మోడై.. గుండెలో దిగింది.
మన్నును అన్నంలా మార్చే
మద్దతులేని నా దేశపు 'వెన్నెముక'
విరిగిన వరికంకై రోదిస్తోంది

డొక్కలెండిన దుక్కిటెద్దు
కబేళాకు పయనమవుతూ
కడసారి చూపుగా
రెండు కన్నీటిబొట్లు రాలిస్తే..
గూడ తెగిన కిర్రు చెప్పులు
నిశ్శబ్దంగా రోదించాయి.

రోజూ దోసెడు నీళ్ళు పోసి
పెంచిన మామిడి కొమ్మ
ఋణం తీర్చుకోవటానికి
ఉరికొయ్యగా మారితే...
చెమటూడ్చిన తుండుగుడ్డ
కొయ్యకు వేలాడుతున్న దేహంపై
నా దేశపు జెండాలా రెప రెపలాడుతోంది
ఒరిగిన వరికంకుపై వాలిన పిట్ట
మౌనంగా ఎగిరిపోయింది. ☆





## డా. బీరం సుందరరావు

*(చీరాల, ఆంధ్రప్రదేశ్)*

ప్రకాశం జిల్లా, అద్దంకిలో సాధారణ రైతు కుటుంబంలో జననం. ప్రఖ్యాత కవి డా. నాగభైరవ కోటేశ్వరరావు గార్కి ఈయన ప్రియశిష్యులు. తెలుగు అధ్యాపకునిగా 36 సంవత్సరాల భోదనానుభవం. అనేక సాహితీ సదస్సులు, ఆకాశవాణి, దూరదర్శన్ ప్రసార మాధ్యమాలలో వివిధ అంశాలమీద ప్రసంగాలు, పత్ర సమర్పణలు చేశారు. ప్రముఖ కవిగా, సాహితీ విమర్శకునిగా అనేక పురస్కారాలతో పాటు 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక' పురస్కారగ్రహీత – డా. బీరం సుందరరావు.

# రైతు ఉగాది రావాలి

డా. బీరం సుందరరావు

ఉగాది వస్తోందట!
ఎక్కణ్ణించి?
గొంతెండిన నదుల్లోంచా?
ఆవులిస్తున్న ఆనకట్టల్లోంచా?
కన్నీటి కాలువల్లోంచా?
ఎక్కణ్ణించి వస్తుంది? ఉగాది!

ఏట్లోనించా?
వల్లకాట్లోనించా?
నాయకుల నోట్లోనించా?
ఎండిపోయిన బీట్లోనించా?
పశువుల్లేని చావిట్లోనించా?
ఎక్కణ్ణించి వస్తుంది? ఉగాది!

ఉగాదులు రావాల్సింది
పంచాంగాల్నించి కాదు
పంటచేల మంచెల్లోంచి
పుస్తకాల సంచుల్లోంచి
నిరుపేదల కంచాల్లోంచి రావాలి!

ఉగాదులు రావాల్సింది
ప్రవచనాల్లోంచి కాదు
కళతప్పిన కళ్ళాల్లోంచి
కవళంలేని పళ్ళాల్లోంచి
వలసపోతున్న ఇళ్ళల్లోంచి

కష్టానికి ఫలితం దక్కని
రైతుల కళ్ళల్లోంచి
రావాలి ఉగాదులు!

ఉగాదులు రావాల్సింది
నాయకుల బూటకపు కూతల్లోంచి కాదు
సగటు మనుషుల నొసటి రాతల్లోంచి కాదుః
కొత్తతరం చేతల్లోంచి
కర్తవ్యనిష్ఠమైన చేతుల్లోంచి
కవుల నిజాయితీ రాతల్లోంచి
భవితవ్యం గీతల్లోంచి
రావాలి ఉగాదులు!

ఉగాది వస్తే చాలు
జేబుల్లో కోకిలల్ని వేసుకుని
కవులు కవిసమ్మేళనాలవుతారు
కలాలకు పదునుపెట్టి కాలాన్ని వర్ణిస్తారు

తరాలు మారుతున్నా
తలరాతలు మారడం లేదు
ప్రభుత్వాలు మారుతున్నా
ప్రజల బతుకులు మారడంలేదు
జెండాలు మారుతున్నా
అజెండాలు మారడంలేదు

సస్యశ్యామల దేశంలో
అన్నదాతల ఆశలు పచ్చబడటంలేదు
బడ్జెట్ లెక్కలు అభివృద్ధిని సూచిస్తున్నా
ఆకలికేకలకు అంతిమగీతం వినబడటంలేదు
పేదరికం నిర్మూలం కాకుండా
పిలకలు వేస్తూనేవుంది

నేలతల్లిని నమ్ముకున్న రైతుబతుకులు
మొలకెత్తని విత్తనాల్లా మురిగిపోతున్నాయి
కాలం కంప్యూటర్లో దాక్కున్నాక
కార్తెలకు కాలం చెల్లిపోయింది
వాయుగుండాలకు దండం పెడితే తప్ప
వానలు కురవడం లేదు

మనుషులేకాదు
మబ్బులూ రైతుల్ని మోసగిస్తున్నాయి
అవి కొండలమీదా
బస్తీల గుండెలమీదా తప్ప
ఎండిన పంటచేలను కనికరించడంలేదు

ధరల మాయాజూదంలో
రైతు మళ్ళీమళ్ళీ ఓడిన ధర్మరాజవుతున్నాడు
బతుకుపోరులో నెగ్గలేక
రథం కుంగిన రాధేయుడవుతున్నాడు
చేలో పంట చేతికందకుండానే
చివరిశ్వాస విడుస్తున్నాడు

పొలంగట్లు తెలియని నాయకులు
అన్నదాతల అగచాట్లు తెలియని అధికారులు
నాగలిని ఒక పురావస్తువుగా చేసి
కాడెద్దుల్ని కంప్యూటర్లో బొమ్మలుగా మార్చి
తరతరాల రైతు కలలను కడతేరుస్తున్నారు

కుబేరులు కొలువుతీరిన చట్టసభల్లో
కర్షకుల కన్నీళ్ళను పట్టించుకునే
నాథుడెవరు?

గ్రామాలు గల్లంతై
నగరాలుగా మారకముందే
కాడి, మేడి, పగ్గం, ఉగ్గం
దుత్త, గిత్త, గట్టు, గెనిమ
నిఘంటువుల్లో మాత్రమే కనిపించే
పదాలుగా మారకముందే
కలాల్ని పొలంగట్లమీద పాతి
తలగుడ్డల్ని కాపాడుకోవాలి!

చారెడు విత్తనాల్ని దేశమంతా చల్లి
నిజాల్ని ప్రజల హృదయక్షేత్రాల్లో నాటి
ఉద్యమాలను మొలకెత్తించాలి!
రండి! కవిమిత్రులారా రండి!

మట్టికి జననమే తప్ప
మరణంలేదని చాటిచెబుదాం రండి!

నాగేటికర్రకు ఆకుపచ్చజెండా కట్టి
ఎర్రకోట మీద ఎగురవేద్దాం రండి!
రైతు ఉగాదిని స్వాగతిద్దాం రండి!

విశ్వావసును రైతునేత్రధనుస్సుగా
ఆవిష్కరిద్దాం రండి! ☆





## డా. వేంకట నక్త రాజు

(డాలస్, టెక్సస్, అమెరికా)

**వృత్తి:** నవజాత శిశువైద్యం

**ప్రవృత్తి:**
భగవద్గీతా–విచారణ–ప్రచారణ–ఆచరణ
“విబుధ జనుల వలన విన్నంత కన్నంత,
నాకు తెలియ వచ్చినంత తేట పరతు”
అంటారు డా. రాజు గారు

ఈయన కలంనుండి–
నమస్తే–“నమస్సుమాంజలి”;
పునస్తే–“మనస్సుమాంజలి” అనే
కవితా సంకలనం వెలువడింది.

# సేద్యం - సువేద్యం

డా. వేంకట నక్త రాజు

రైతన్నా?
ఓ రైతన్నా?
మా జాతి మనుగడకు,
మానవ జాతి మనుగడకు,
మా "నవ" జాతి మనుగడకు,
తరగని ధారవు నీవన్నా?
చెరగని ఆధారం నీవన్నా
నీవు మామూలాధారం కావన్నా?
నీవే మా మూలాధారం ఓరన్నా?
"అన్నం న నింద్యాత్"
"అన్నం బహు కుర్వీత"
"అన్నం న పరిచక్షీత"
(అన్నమును నిందించకు
అన్నమును నిరసించకు
అన్నమును ఎక్కువగా పెంచు,
ప్రపంచానికంతా మక్కువతో పంచు)
అన్న ఉపనిషద్ వాక్యాలను
ఉద్ఘోషించిన ఋషివర్యుడివి,
ఉద్యమించిన కృషీవలుడివి,
హాయినిచ్చే హాలికుడివి,
హర్షదాయకుడివి, కర్షకుడివి?
ఉర్వి యజ్ఞంలో
మహావిష్ణుడికి,
ఉదర యజ్ఞంలో
వైశ్వానరుడికి,
జీవుల జఠరాగ్నికి,
ఆహుతి నీ సేద్యం,
యజ్ఞపతికి భక్తితో
నైవేద్యం, ఇది సువేద్యం?
నీవొక జీతం లేని భృత్యుడివి,
నీవు జీవితంలో కృతకృత్యుడివి?
ఈ లోకంలో,
సకాలంలో
మనకు జన్మనిచ్చి, జలమునిచ్చి,
వనరులిచ్చి, వరములిచ్చి,
వనములిచ్చి, ఫలములిచ్చి,
వసతినిచ్చి, మమతనిచ్చి,
పాలించి, పోషించే తల్లినే
శోషించి, దూషించే దోషులెందరో?
కృతఘ్నులు
ఘోర క్రూర కృత్యులు,
కడు పాపిష్టులు,

చెడిపోయిన దుష్టులు,
అహంకార భూయిష్టులు,
అర్థపరులు, స్వార్థపరులు,
నీతిలేని దొరలు,
అవినీతి వ్యాపారులు
భూమికే భారమైన
భూస్వాములు, ఎందరో!
ప్రకృతిమాతనే
వికృతం చేసి,
పాలిచ్చిన రొమ్మునే
కుమ్మి కుమ్మి చిమ్మి వేసి,
పుడమి తల్లి గర్భాన్నే
గిల్లి గిల్లి తొలిచేసిన,
నరకాసురులు ఎందరో!
నర రూపంలో తిరుగాడే
అసురులు, కసాయిలెందరో?
అడవులన్ని కాల్చివేసి,
నదులనన్ని చీల్చి వేసి,
కొండలన్ని తవ్వి వేసి,
పండు భూమి పిండి చేసి,
ప్రపంచాన్ని కంపించి,
పంచభూతాల్ని కబలించిన
వంచకులెందరో!
పరి వంచకులింకెంఎందరో!
యజ్ఞమే విష్ణువు,
కర్మయే యజ్ఞం,
యజ్ఞంతో వర్షం,
పర్జన్యంతో అన్నం,
అన్నంతో జీవులు,
ఇది ప్రకృతి చక్రం.
ఈ ప్రకృతిచక్రాన్ని తిరస్కరించి,
వక్రీకరించిన అఘాయులెందరో,
మూగజీవుల బలిగొన్న
మోసపూరిత మోఘజీవులెందరో!

రైతన్నా?
ఓ రైతన్నా?
ఒక్కడివే, నువ్వొక్కడివే,
నిరంతర శ్రామికుడివి,
నిజ సైనికుడివి, నిత్య సేవకుడివి,
శాంతి కాముకిడివి, క్రాంతి ప్రేరకుడివి,
శాసించే వీరుడివి, గర్జించే శూరుడివి,
చిరంజీవివి, బాహుబలివి, వజ్ర శరీరివి,
నీవే ఈ దుర్మార్గం ఆపగలవు,
ఈ దురాగతం నిలుపగలవు,
నీవే ఈ దుశ్చర్యం నలుపగలవు,
ఈ దుష్కృతం దులుపగలవు?
అందుకే
పుడమితల్లికి నువ్వంటే ఇష్టం.
నువ్వే లేకుంటే

జీవనమెంతో కష్టం,
జీవుల బ్రతుకంతా నికృష్టం,
ప్రపంచానికెంతో నష్టం,
ప్రణష్టం, మహా వినష్టం.
నీ కృషితో పుడమి పులకరిస్తుంది,
నీ స్పర్శతో ప్రకృతి పలకరిస్తుంది.
నీ బుద్ధి వ్యవసాయాత్మికం,
నీ సిద్ధి అచ్యుతం, అమృతం?
నీ కృషితో
మేమంతా నిశ్చింతగా
రేయింబవళ్ళు తినగలం?
నీ కృపతో
తుష్టితో, పుష్టిగా మనగలం?
నీ నాగేటి చాలుతో
సీతామహాలక్ష్మిని కనగలం?
శ్రీరామ రాజ్యంలో
విశ్వంభరకు జయమని అనగలం?
నీ వల్లే ఈ విశ్వావసులో
విశ్వకళ్యాణం కనగలం?
శుభం - శ్రియం - శివం- మంగళం





## శ్రీ బండ్ల మాధవరావు

(విజయవాడ, ఆంధ్రప్రదేశ్)

**జన్మస్థలం:** అమరావతిలోని అనంతవరం గ్రామం. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుండి తెలుగులో ఎం.ఏ; ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంనుండి ఆంగ్లంలో ఎం.ఏ పట్టాలు పొందిన విద్యావేత్త. విజయవాడ నగరంలో 'శిఖర స్కూల్', 'రిజోనెన్స్ జూనియర్ కళాశాలలు' స్థాపించి భావి భారత పౌరులను తీర్చిదిద్దే క్రమంలో ఉన్నారు.

**మాధవరావు గారి కలంనుండి ఇప్పటివరకు...**

"చెమట చిత్తడినేల"; "స్పర్శ"; "అనుపమ"; "ఊరి కల" "దృశ్య రహస్యాల వెనుక"; "పొలం గట్ల వెంట", పాపినేని శివశంకర్ గారితో కలిసి "మాఊరు – మాఇల్లు" అనే కథా, కవితా సంపుటులు వెలువడ్డాయి.

అనేక సాహితీ ప్రచురణలకు సంపాదకత్వం వహించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక సాహిత్య సభలలో పాల్గొని తన వాణిని సమర్ధవంతంగా వినిపించారు. 'తానా ఉత్తమ కవితా పురస్కారంతో' సహా అనేక సన్మానాలు, సత్కారాలు బండ్ల మాధవరావు అందుకున్నారు.

# ఆకుదీసిన ఈనెలు

శ్రీ బండ్ల మాధవరావు

చేలో బార్లు తీరిన
సైనికుల్లా పొగ మొక్కలు
నిటారుగా నిలబడి
వందనం చేస్తున్నాయి
నల్లటి నేల మీద
పచ్చ చుక్కల్లా మెరిసిపోతూ
మోరలెత్తి ఆకాశం వైపు చూస్తున్నాయి

పైరగాలికే ఆకులు బారలు చాస్తూ
నింగి వైపు ఎగబాకుతున్నాయి
నిండాపరుచుకున్న
మంచు దుప్పట్లోంచి తొంగి చూస్తున్న
ఆకులపై పేరుకున్న నల్ల మడ్డి
లేలేత ఎండకి నిగనిగలాడుతోంది

పొద్దుపొడుపుకు ఎదురెళ్లే
వడుపైన చేతులు ఇరిసిన ఆకులు
పచ్చపచ్చగా చేదు వాసన వేస్తున్నాయి

గుడ్డి వెలుగు దీపం
దారి చూపిస్తూ
గొరుకొయ్యల దిక్కుకేసి
నక్షత్రాలు లెక్క పెట్టుకుంటూ సాగిపోతోంది

తూర్పున చుక్క పొడవకముందే
గుట్టలుగా పోగుపడ్డ ఆకులు
గుర్రం మీద కర్రకు వడుపుగా
వడివడిగా అల్లుకుంటున్నాయి

కర్రకు ఆకు అందించే ముఖాలకు
ఏ ఫెయిర్ అండ్ లవ్లీలు అవసరం లేదు
పొగాకుమడ్డి బెత్తెడు మందాన
అంటుకున్న ముఖాలు
చిక్కటి నవ్వుల్ని విరగబూస్తున్నాయి

చలికి ఒళ్ళు విరుచుకుంటూ
బేరన్ పొయ్యిలోకి బొగ్గేస్తున్న
అన్నం మెతుకులు
నల్లగా మసిబారిపోయాయి

బేరన్ లోంచి దించే ఆకు
పసుపు వర్ణానికే మారుపేరులా
బంగారం దించుతున్నట్లే ఉంది

తెల్లారగట్ట మంచుకు మెత్తబడ్డ ఆకులు
అదో రకపు కమ్మని వాసనతో
చెక్కుల్లో ఇమిడిపోతున్నాయి

శ్రమను పేర్చుకున్న పొగాకు పందిళ్ళలోని
బంగారం బంగారంలా అమ్ముడవడం లేదు
చెక్కుల్లోంచి నాలుగు ఆకులు
బయటకు లాగిన చేతులు
పెదవి విరుపుమాటలతో
ఆరుగాలపు కష్టాన్ని యిరగ కోస్తున్నాయి
చూర్ణమైపోతున్న బతుకులు
ఆకుదీసిన ఈనెల్లా
చెత్త కుప్పలు చేరుతున్నాయి ☆



## డా. కొండపల్లి నీహారిణి

*(హైదరాబాద్, తెలంగాణ)*

డా. కొండపల్లి నీహారిణి గారు ఒక ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, సాహిత్య విమర్శకురాలు, వక్త.

"మయూఖ", "తరుణి" అంతర్జాలపత్రికా సంపాదకురాలు.

ఇప్పటివరకు నాలుగు కవితా సంపుటాలు, రెండు కథా సంపుటాలు, మూడు జీవిత చరిత్రలు, మూడు వ్యాస సంపుటాలు, పరిశోధన గ్రంథం, ట్రావెలాగ్ వంటి పదిహేను పుస్తకాలు ప్రచురించారు.

సామాజిక చైతన్యం కలిగించే ఉద్దేశ్యంతో కవిత, కథా ప్రక్రియలెంత ఆసక్తితో రాస్తారో- అంతే ఆసక్తితో సాహిత్యవిమర్శనా కోణంలో సమకాలీన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తారు, విమర్శిస్తారు.

# విశ్వ విజేతలు - పోలినీ పోలికులు

డా. కొండపల్లి నీహారిణి

చుర్రుమని ఎండ తగలగానే
గబుక్కున ఇంట్లోకి పరిగెత్తే నేను
బుస్సుమని పాము పడగెత్తిందనగానే
గుండె గుభేలుమనే నేను సమస్త మానవాళికి ప్రతీకను

నేను వేళ తప్పకుండా భుజిస్తాను
నేను క్రమం తప్పకుండా నిదురిస్తాను
ఇవి ప్రాథమిక అవసరాలే కదాని లోకం ఉవాచ!

ఈ లోకంలో జీవన యానం చిన్నదేం కాదు!!
తోటి ప్రయాణీకుల మాటల సారాన్ని
కారణాలు లేకుండా గ్రహిస్తుంటాను
ఓ చోట వాళ్ళంతా రొట్టెలు మాత్రమే తింటారన్నా
ఓ చోట వరిఅన్నం తెలియదన్న మాటలు విన్నా
తెలుగు ధనం లేదేం అనీ అనుకుంటాను
పప్పు వండే పద్ధతి కూర రుచి పచి విషయాలు చెవిన పడగానే
ఎందరి అధరాలో నెలవంకలు అవుతాయని తెలుసు
బ్రెడ్ అండ్ బట్టర్ లేనిదే బ్రతకలేని విదేశీయుల్నీ
చిటపట పోపుల నూనెలు వంటింటికే పరిమితం కాదనీ
మనవైన లోగిళ్ళ నుండి మసాజ్ సెంటర్ల వరకు
ఆయిల్ గింజల ఉత్పత్తులూ కాయగూరలూ ఒకటేమి?
ఆవాలనీ జీలకర్రనీ గుర్తు తెచ్చుకొని స్పైసి థింగ్స్
రుచుల వేటలో ఘాటు రుచులలో చింత చింతనలో
పాత్రలయ్యే కారాలు మిరియాలు గుర్తొచ్చి
కంటి తెరపై  పచ్చని పులిహోర చిత్రిక పడుతుంది
దినుసులేవైనా డబ్బాల్లో సీసాల్లో చేరాలంటే

ఎంత కష్టమో జ్ఞాపకాలు మరుపులూ మెరుపుల మరకలే!

అదేంటో ఇంటింటికి ఓ మంటి పొయ్యి అంటారు
సామెత బంధుగణాలకు ఆమెత కాదని తెలిసినా
నిగనిగలాడే హోటళ్లలో నాలాంటి వాళ్లేగా తినేది!
ఆశ్చర్యార్థకమే ముందు వచ్చి పడుతుంది!!
వండివార్చేవాళ్ళ అగచాట్ల మాటేమో గానీ....
పండించే వాళ్ళ అలవాట్లు అనాలోచితంగా గుర్తుకొచ్చి
ఒక్కసారిగా గుండె చెరువయిపోతుంది

వాళ్లేంటో....
ఎర్రటి ఎండ కాల్చినా
విష సర్పాలు కాటేస్తాయని తెలిసినా
ఎప్పటిలానే వ్యవసాయం చేస్తూ
మన సాయం లేకుండానే సహాయమవుతుంటారు
కట్లపాము చెట్టుర్కపాము జెర్రిపోతు
తేళ్ళు నేల సహజాతాలని తెలిసినా ఎలుకలూ చిమ్మటలూ
పిట్టలదాళ్ళున్నా అవి వాళ్ళ సహచరులవుతాయి
కక్షల కార్పణ్యాల కుళ్ళు కుట్రల మనుషుల్ని చూస్తాం
రైతులెట్లా జీవితకాలం ప్రమాదాల మధ్య
పూబంతులెందుకవుతారో ఎవరాలోచిస్తారు?
సహవాస దోషంతో సహజీవుల్ని లెక్కచేయరేమో!
కార్తె కార్తెలో ఓ పంటకోసం ఆరాట పడుతుంటారు
ఆర్తి చెందే లోకానికి ఆహారమవుతుంటారు

రైతును హాలికుడు అంటారు
నేను ఆమెను హాలిని అని అంటాను
హలంపట్టినా విత్తులు విత్తినా
అతని భుజాల బలం అవుతుంది ఆమె
అతని దప్పిక నీరవుతుంది ఆమె

కలుపుతీసి కోత కోసే అవసరమూ అవుతుంది
ఎంత చేసినా గింత కూడా పేరే రాదన్న
చింతను వదిలి చింతాకంతకూడా వెనుగడుగు వేయదు
ఈ హాలిని హాలికులంతా
హాయి హాయిగా పాటలేం పాడుకోరు!
బంగారు స్వప్నజగత్తు తెలియాటలేముంటాయ్?
కోట్ల జనుల భోజన భాజనాలకు భవిష్యత్తవుతుంటారు

వ్యసనాలు పలు తీర్లు
వారో వీరో బారులు తీరి వాగే మాటలకేంగాని
మిల్లెట్స్ ఎట్లొస్తాయో బియ్యం వడ్లనుండే
వస్తాయోననీ తెలియని వారసులను మెక్కించేందుకు
ఎన్నో అకృత్యాలు చేసే నికృష్టులు
మా అష్టకష్టాలు గమనించట్లేదేనని వాపోయి
వ్యవసాయం చేయక ఊరుకోరు వాళ్ళు
నాట్ల బీట్ల బాట్ల పాట్లు అన్నీ ఓట్లప్పుడు మరిచిపోతారు
నాయకుల వాగ్దానాలకు బలయ్యే మట్టిమనుషులు
సూర్య ప్రతాపాన్ని లెక్కించనట్టే
అకాల వర్షధాటిని తట్టుకుంటారు
ఎండిన పంటనో మునిగిన మళ్లనో చూసి
ఈ ఏడిట్లాయెనని తమను తాము తిట్టుకుంటారు
ధర్నాలో ఆత్మహత్యలో న్యూస్ ఐటమ్స్ అయినప్పుడు
రైతులు టీవీలో స్క్రోల్ అవుతుంటారు
పేపర్స్ లో జాలి గీతల కార్టూన్స్ అవుతుంటారు

కలలను వమ్ము చేసే కన్నీటి తెరతో
అరచేతుల యంత్రంలో యాదృచ్ఛికమవుతుంటారు
యెద్దూ యెవుసం వాళ్ళ కళై
మట్టో గట్టో బురదో ఒరుసో వాళ్ళ ఉసురై
మార్కెట్ దళారీలకు ఎరలై

ఎరువులూ ట్రాక్టర్లు కరెంటు  అలవాటై ...గ్రహపాటై ...
ప్రపంచీకరణ వీళ్ళ దుఃఖ గీత పద చరణాలైనప్పుడు
కర్షకులు ఓ కర్మచారిగా భ్రమిస్తూనే ఉంటారు

ఈ విశృంఖల జనారణ్యంలో
పంటకు చోటు లేకుండా మొలుస్తున్న కాంక్రీట్ బిల్డింగుల్లో
తన జాడలేవీ కానరాకున్నా
రెక్కల కష్టాన్ని నమ్ముకుని
శృంఖల బద్ధులౌవుతారు! వాళ్లు రైతులు!!

దేశమేదైతేనేం
సరిహద్దుల్లో జెండాలు రెపరెపలాడుతున్నాయంటే
కర్పూర దీపకళికల వంటి రైతులవల్లే
పసిపాప బుగ్గల్లో పాలనవ్వులు విరుస్తున్నాయంటే
పాడి పశువుల పహారా వీరులవల్లే
నాది నీది ప్రాణపు చెట్లు తలలూపుతున్నాయంటే
తారా శశాంకుల వంటి హాలినీ హాలికుల
నిరంతర చెమట చినుకుల వల్లే!
రైతు జీవితం రాయలేని దీర్ఘకావ్యం
రైతు జీవితం రాయాల్సిన ప్రేమకావ్యం
రైతులు అస్తమించని సూర్యులు
రైతులు విశ్వవిజేతలు!! ☆





## శ్రీమతి నారదభట్ల అరుణ

*(హైదరాబాద్, తెలంగాణ)*

**జన్మస్థలం:** పెద్దపల్లి జిల్లాలోని మంథని
**ప్రస్తుత నివాసం:** హైదరాబాద్.

**అచ్చైన వచన కవిత్వ సంపుటాలు:** "ఇన్నాళ్ళ మౌనం తరువాత", "లోపలి ముసురు", ట్రావెలాగ్: "నా అమర్నాథ్ యాత్ర" అచ్చైంది.

మరో వచనకవితా సంపుటి ముద్రణకు సిద్ధంగాఉంది. "అనంత ఛందస్సౌరభాలు" అనే పద్య సంకలనంలో వందమంది పద్యకవులలో ఈమె ఒకరిగా వందవృత్తాలతో వంద పద్యాలు రాశారు. 500 లకు పైగా అనేక అంశాలపై పద్యకవిత్వం, వచనకవిత్వం చేసిన అరుణ గారు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

# ఆర్గానిక్ ప్లెక్సీ

శ్రీమతి నారదభట్ల అరుణ

రైతు పక్షం
రైతు పక్షం
మార్పు కావాలి
ఆహ్వానించడంలోనే కరువంతా!

దారాలు తెగిపోయిన అరుపులలో ధరలు
రైతుముఖాన నవ్వులు చూడలేని లోకం!

మార్కెటింగ్ ప్రశ్నార్థకాల్లో
కనీస మద్దతులు!
దాచుకునే సౌలతు లేని పుష్కల పంటలు!
అందుబాటులో లేని
గిడ్డంగులు
అవసరానికి పనికిరాని
నిలువలు
అందని ధరలలో
నిద్రిస్తున్న ధాన్యరాశులు!
కుళ్ళిన వాసనలతో ముడుచుకుపోతున్న
శీతల గదులు
సబ్సిడీలను ఓపలేని పన్నుల పన్నాగాలు...

వేసిన పంటే మళ్ళీ మళ్ళీ...వేసి
కొత్తదనం తొడగని మట్టి
నేలసారం...మార్కెట్ అవసరం చూడని రైతు....రాజ్యం
తనకు మాలిన ధర్మంలో దేశం!

పాశ్చాత్య పోకడల ఆహారాలు
జీరోసైజుల తాపత్రయాలు
తినేందుకు పనికిరాని శరీరాలు

రైతన్నా....
ఇక నీ పంటను నువ్వే అమ్ముకో
ఊరికో పది శీతల గిడ్డంగులు కట్టుకో...
నీకు నిన్ను దగాచేసే దళారెందుకు?
నువ్విప్పుడు నిరుద్యోగాన్ని పారద్రోలే ఆయుధానివి!
జనం పంటే పండించు...

ఆకుపచ్చని ఆకాశమా... ఓ రైతన్నా
నువ్విప్పుడు కొత్తగా మొలకెత్తు
నీ పొలం ముందు ఆర్గానిక్ బోర్డొకటి తగిలించు...
సేంద్రీయ వ్యవసాయ ఫ్లెక్సీలు పెట్టు
తెల్లని లాల్చీ పైజామా వేసుకుని
భుజంపై ఆత్మవిశ్వాసపు కండువా ధరించు!

పొలం మధ్యలో విల్లా కట్టుకుని
నిశ్చింతగా జీవించు
నీదైన పచ్చని ప్రకృతమ్మతో
ప్రేమగా కబుర్లు చెప్పు!!
దారి వెంట పోయే నేనే
నీ పొలం బోర్డు చూసి
పంటకొనుక్కుపోతా!! ☆





## శ్రీమతి పి. అమరజ్యోతి

(అనకాపల్లి, ఆంధ్రప్రదేశ్)

**స్వస్థలం:** అనకాపల్లి. గత పాతిక సంవత్సరాలుగా వృత్తి, ప్రవృత్తి అంతా వ్రాయడం, చదవడం, సాహిత్య సాంగత్యమే!

"అనకాపల్లి సాహితీ వేదిక", "తెలుగుభాష పరిరక్షణ సమితి", "భారతీయ వికాస్ పరిషత్", "ప్రజాస్వామిక రచయిత్రుల" వేదిక మొదలైన సాహితీ సంస్థలలో క్రియాశీలకంగా ఉన్నారు.

ఈమె కలంనుండి ఇప్పటివరకు – "మొలుస్తున్న రెక్కలను ప్రేమిస్తా", "నీకు తెలియని నువ్వు" అనే రెండు కవితా సంపుటాలు, "సారాంశం" అనే కథా సంపుటి ప్రచురణలోకి వచ్చాయి. ఈమె వ్రాసిన కొన్ని కథలకు, కవితలకు పురస్కారాలు కూడా అందుకున్నారు.

# ధ్వజస్థంభంలా

శ్రీమతి పి. అమరజ్యోతి

నాగుని మెడపై వేసుకుని శివుడు
మరుభూమిలో కాటికాపరై
తిరుగుతూంటాడు
నాగలిని భుజంపై వేసుకుని కర్షకుడు
పంటభూమిలో కాపలాకాస్తూంటాడు
కష్టజీవిగా..
దేవతలకే దేవుడైన వాడూ,
మానవులకే మనుగడైనవాడూ
ఇద్దరూ జీవులకు ఆధారభూతులే.
ప్రజలకు పట్టెడన్నం పెట్టడానికి
పడరాని కష్టాలు పడే కష్టజీవి రైతు
ఈశ్వరుడు కంఠంలో విషాన్ని దాచి
అమృతాన్ని పంచినట్లు
ఈ కర్షకుడు ఆర్థిక నష్టాలకు,
అప్పులతో కుదేలై,
విత్తన కొనుగోలులో మోసపోయి,
దళారులతో మోసపోయి,
ప్రకృతి వైపరీత్యాలకూ కుంగిపోయి
జీవితాన్ని ఈడ్చలేక, బతకలేక,
ఉరిదండలేసుకుంటాడు.
తనను తానే సన్మానించుకుంటాడు
పురుగులను చంపలేని మందులు
రైతన్నల కోసం జాలిపడతాయి
కష్టజీవి కర్షకుని ఉసురుతీస్తాయి.
స్వతంత్రం అందరికీ వచ్చినా,
రైతన్నకు రాలేదేమో!
తన కష్టానికి, పంటకూ ధర
నిర్ణయించలేడు.
తమ వస్తువు ధర తమ ఇష్టమని
నిర్ణయాధికారం ప్రతీ వర్తకునికీ
వుంటుంది ఒక్క రైతుకి తప్ప.
తమ సేవలకు జీతాలు పెంచమనొచ్చు,
హఠం చేయవచ్చు
రక్తాన్ని చెమటగా చిందించే రైతుకి
ఏమీ వర్తించవు చేస్తే దారుణ శిక్షలు
శ్రమిస్తూ ప్రజల. ఆకలీ దాహం తీర్చాలి.
చెరకు పండించి రసం తీసి పంచి
ఒట్టి పిప్పిలా మిగిలిపోవాలి లేదా చావాలి.
ఎటూ పాలుపోని రైతు అయోమయంతో,
అడకత్తెరలో
పోకచెక్కలా నలిగిపోతూంటాడు.
ఇన్ని కష్టనష్టాలతో రైతుబాంధవుడు
నాగలి భుజానవేసి
మళ్ళీ మట్టిలోకే నడిచాడు
శిలువను మోస్తున్న ఏసుప్రభువులా..
అన్నా! రైతన్నా!
మా అన్నదాతవు నీవు!
మా అన్నపూర్ణవూ నీవే!!
మానవజాతి మనుగడకు
మూలాధారమూ నీవే!!
జెండా కర్రలా సెల్యూట్ అందుకోవటమే
కాదు
ధ్వజస్థంభంలా ఆత్మస్థైర్యంతో నిలవాలి
నీవు మా కోసం
స్థిరంగా.. శాశ్వతంగా.. ☆



## శ్రీ యార్లగడ్డ రాఘవేంద్రరావు

(హైదరాబాద్, తెలంగాణ)

**చదువుకున్నది:** మోడరన్ బయాలజీ కాని గత 4 దశాబ్దాలకు పైగా పాత్రికేయ జీవితం.

'ఉదయం' పత్రికతో ప్రారంభమైన పాత్రికేయ ప్రస్థానం తనను ఈనాడు వైపు నడిపించి అక్కడ విపుల, చతురలాంటి సాహితీ మాసపత్రికలకు రెండేళ్ల పాటు సంపాదక బాధ్యతల నిర్వహించేటట్లు చేసింది.

ప్రస్తుతం హైదరాబాద్‌లో ఆంధ్రజ్యోతి యాజమాన్యంలోని జర్నలిజం కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు.

ఇప్పటివరకు ఈయన కలంనుండి – 1 నవల, 16 కథలు, 6 కవితాసంపుటాలు వెలువడ్డాయి. వీటిలో 3 కవితా సంపుటాలకు 6 పురస్కారాలు అందుకున్నారు.

# ఈ చరిత్రను కబ్జా చేయాల్సిందే!

శ్రీ యార్లగడ్డ రాఘవేంద్రరావు

అన్ని ఆరంభాలకు ఒకటే ప్రారంభమై
అన్ని కొనసాగింపులకు ఒకటే ముగింపై
హద్దులన్నీ తుడిచేసి
అర్థంకాని కుతంత్రాల్లో కుదేసి
అన్నిటికీ అదే కొలమానమై
అడుగుతీసి అడుగేస్తే అల్లుకునే చుట్టరికమై
ప్రతిక్షణం మీద రివ్వున వాలుతూ
ప్రపంచాన్ని పడుగుపేక చేసి ఆడుకుంటున్న
విత్తం ముందు
విత్తనం తలవంచదు

సూర్యుడెంత నిప్పులు చెరిగినా
చిన్నచెట్టుకు సైతం ప్రణమిల్లాల్సిందే
మనిషెంత ద్రవ్యసంపుటి అయినా
నడిపించే నేలకు సాగిలపడాల్సిందే
నాగటికొర్రు దయతలచిన
నాగరీకమెంత నగరీకమై నీలిగినా
నాగటిచాలు ముందు దిగదుడుపే

ఆకలిని బతికించడమే
లాభసాటి వ్యాపారమైన చోట
కన్ను మూసినా తెరిచినా
జీవనమధురిమ జీర్ణపత్రమై
కొనుక్కున్నా అమ్ముకున్నా బతుకొక్కటే అయి
బహుళజాతి తెరమీద
కేతిగాడి వేషంలోకి కుదించబడుతున్నా
ఈ ధరణీతలం మొత్తం
ధాత్రీపుత్రుడొక్కడి సొంతమే

ఈ కష్టమర్లు, కన్స్యూమర్లు, క్లయింట్లు
మర్యాదస్తులు, మారీచుల ప్రపంచంలో
నడిచే ధాన్యాగారానికి చోటులేకుండా చేసిననాడు
నరుడూ ఉండడు, నాగరికతా మిగలదు

అక్షయపాత్రయి గడప గడపను తట్టేవాణ్ణి
తక్కెడలో ఇనుపగుండును చేసి
బతుకును తీరనిబాకీగా మార్చేస్తే
ఆకుపచ్చని కలకు అరదండాలు వేసి ఆరడిపెడితే
జాగృతి ఉండదు, జాతికి జవమూ మిగలదు!

★ ★ ★

దున్నుకున్న నేలలోనే
దుమ్ముకొట్టుకుపోతూ
ముంచెత్తే ఉప్పుటేరుల్లో
పెనుగులాడుతున్న పాలకంకులన్నీ
ఛిద్రస్వప్నాల నుంచి
ధ్యానభంగాలనుంచి
దగ్ధగీతాల ఆర్తరావాలనుంచి అంధకారాలనుంచి
ఆర్ద్రరహిత అనంతయాత్రలనుంచి
భంగపాటుకు అలవాటుపడ్డ విశ్వాసాలనుంచి
అంగడిబజారుల్లో ఆక్రోశాలు
హత్తుకున్న విధ్వంసాలనుంచి
తెగిపడ్డ కలలతుంపుల్ని కలిపికుట్టుకుని
నేలనరాల్లోంచి గునపాలై ఎగిసిపడి
దగా చేస్తున్న కాలాన్ని, కాలం కౌగలించుకునే చరిత్రను
కబ్జా చేయడమే ఇప్పుడిక ఏకైక కర్తవ్యం

అనంతహత్యల్లోనుంచి వెల్లువెత్తే మెతుకుదీపం
చితికిన నక్షత్రాన్నే చివరిగింజగా నాటుకుని
చరిత్ర శిరసు మీద అజేయశిఖరమై పాతుకుపోవడమే
ఇప్పుడిక అనివార్యమైన అవసరం. ☆





## శ్రీ చిటిప్రోలు సుబ్బారావు

(హైదరాబాద్, తెలంగాణ)

వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్ అయిన చిటిప్రోలు సుబ్బారావు గారు టాంజానియా, తజికిస్తాన్, భారతదేశంలో వివిధ ప్రాంతాలలో పనిచేసి, ప్రస్తుతం హైదరాబాద్‌లో విశ్రాంతజీవితం గడుపుతున్నారు.

వీరి తండ్రి గారైన కృష్ణమూర్తి గారు పద్య కవిత్వంలో కవిరాజు. వీరు వ్రాసిన 'పురుషోత్తముడు' అనే కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు.

ఆ కుటుంబ నేపథ్యం కారణంగా వీరు కూడా చిన్నప్పటినుండే సాహిత్యంపై ఆసక్తి పెంచుకున్నారు.

సుబ్బారావు గారు – 'అక్షర మేఘాలు' పేరుతో స్వీయ కవితా సంపుటిని, భారత పూర్వ రాష్ట్రపతి, భారతరత్న డా. ఎపిజె అబ్దుల్ కలాం గారు వ్రాసిన ఆంగ్లకవితలను 'అబ్దుల్ కలాం అంతర్నాదం' పేరుతో తెలుగులోకి అనువదించి ప్రచురించారు.

# రైతుదేవోభవ

శ్రీ చిటిప్రోలు సుబ్బారావు

రోజూ తినే అన్నమే ఈ రోజెందుకో
ప్రతిగింజ మీదా తినేవాడి పేరు రాసుంటుందనే
నానుడి గుర్తొచ్చింది

నాపేరెవరు రాసుంటారోననుకుంటూ
ఇంటాబయటా వెతికాను
ఎవరూ కనిపించలేదు
భగవంతుడూ కనిపించలేదు

ఎడదయెరుకలనూ మేధమెరుపులనూ
కాగితాల మీద పెట్టటమేగానీ
గింజలమీద రాయటం మాకు రాదన్న
తత్వవేత్తల పలుకులూ శాస్త్రవేత్తల మాటలూ విన్నాక
నా వెతుకులాట పంటపొలాల్లోకి చేరింది

"నాకసలు రాయటమే రాదు కదయ్యా" రైతు బేలగొంతు కంటే
అతడి ఖాళీకంచపు చప్పుడే గట్టి జవాబు చెప్పింది

నాతో ఏ సంబంధమూ లేని నన్ను బతికిస్తూ
తాను పస్తుంటూ ఇన్నిగింజలపై
నాపేరు రాస్తున్న ఈ మహనీయుణ్ణి
ప్రథమ దైవంగా పూజిస్తున్నాను

అతిథి దేవోభవ కంటే ముందుగా
ఆచార్య దేవోభవ కంటే ముందుగా
పితృ దేవోభవ కంటే ముందుగా
మాతృ దేవోభవ కంటే ముందుగా

రైతు దేవోభవ అని ఎలుగెత్తి చాటుతున్నాను.

☆



## డా. శ్రీరమ్య రావు

(న్యూజెర్సీ, అమెరికా)

వృత్తిరీత్యా, అమెరికాలో న్యూజెర్సీ రాష్ట్రంలో వైద్యురాలిగా సేవలందిస్తున్న డా. శ్రీరమ్య రావు గారికి తెలుగుభాష అంటే అపారమైన మక్కువ! పాటలు వ్రాయడం, కవితలు వ్రాయడం, తెలుగు సాహిత్యం చదవడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చే ప్రక్రియలు అంటారు ఈమె. తెలుగు భాష, భారతీయ కళలు, భారతీయ సంస్కృతిని అంతర్జాతీయస్థాయిలో ప్రదర్శించడంలో తన వంతు కృషిచేస్తున్నారు.

# రైతన్న

డా. శ్రీరమ్య రావు

నాగేటి చాలున
అంతాటి మహా లక్ష్మినే
గన్న అన్న రైతన్న !

ఎంతాటి మహరాజు అయినా
నీ చేత్తోటి పెట్టిన
అన్నమే కదా ఆహారం
మెరిసేటి బంగారం
మింగేటి రాజు లేడు కదా !

కురిసేటి వానలో తడిసిన నేలన
కలిసిన నీ శ్రమే మొలకలెత్తేనే !
అంతాటి అన్నపూర్ణమ్మైన
నీ చెమటాతో పండిన పంటనే కదా
జగమంతాటికి వండి వడ్డించేది
అన్నా ! రైతన్నా !

కర్షక కృషి యజ్ఞముగ చేసి
వర్షముల కురిపించేవే
నీ పోషణతో పెంచేవే పాడిపంటలు
నీ పంట వంటపట్టించుకునే కాదా
మనిషికి మేధ మరి కండబలం
శ్రీ కృష్ణుడు చెప్పిన గీత
నీ చేతల చూపేవే !
అన్నా! రైతన్నా !

నాగేటి చాలు పంటే కదా
ఎంతోటి కంప్యూటరు యుగానికైనా
సాఫ్టువేరు సాపాటు చేసేటి
టెక్కియే లేడు కదా !
పంటకాపు కంటి కావలిలో పండిన
పంటరాశి కమ్మని వంటగ తింటమే
ఏ యుగానైనా ఎంతాటి మనిషికైనా !
అన్న రైతన్న !



## డాక్టర్ శ్రీదేవీ శ్రీకాంత్

(బోట్స్వానా, దక్షిణాఫ్రికా)

- చిక్కని కథనంతో మనసులను కదిలించే కథా రచయిత్రి.
- నవలలలో హద్దులులేని విశ్వాన్ని సృజించే నవలా రచయిత్రి.
- మధురమైన పదాలతో హృదయాలను తాకే పాటల రచయిత్రి.
- సమీక్షలతో సత్యాన్ని వెలికితీసే సమీక్షకురాలు.
- పదాలకు ప్రాణంపోసే కవయిత్రి.
- చిత్రాలకు జీవంపోసే చిత్రకారిణి.
- నాట్యంతో నృత్యరూపాన్ని సృష్టించే నర్తకి.
- వీణానాదంతో సంగీతాన్ని మంత్రముగ్ధంచేసే వీణావాదకురాలు.
- సృజనాత్మకతకు ప్రతిరూపం
- వీటినన్నింటినీ మించి – అందరినీ ఆకట్టుకునే ఉత్తమ వ్యక్తిత్వంగల దక్షిణ ఆఫ్రికాలోని 'బోట్స్వానా' దేశంలో వైద్యవృత్తిలో ఉన్నారు డా. శ్రీదేవి శ్రీకాంత్ గారు.

# ఓ రైతన్నా! జీవాధారం నీవేనన్నా!

డా. శ్రీదేవీ శ్రీకాంత్

ఈ ప్రపంచానికి ఓంకారం నీవు
అవని అమ్మకు గుండె చప్పుడువు నీవు
అస్తిత్వానికి రంగులు అద్దే
చిత్రకారుడు ఆదిత్యునికి నేస్తం నీవు
విత్తులను పసిడి ధాన్యరాశులుగా మార్చే
తపస్సులో రసవాదివి నీవు
బీడునేల ఎదలో మమతల తేమను
నింపుతూ విరామం లేకుండా సాగే
భగీరథుదుని దీక్షవు నీవు
మొలకెత్తే ప్రతి విత్తులో జీవుల
శతకోటి ఆశల హరివిల్లును చూసే పరువం నీవు...
భువిజనుల ఉదరానికి నిత్య క్షీరాణాన్నివి నీవు...

**ఓ రైతన్నా! మానవజాతి మనుగడకు**
**జజీవాధారం నీవే నన్నా!**

తప్త తరణి ప్రచండ వేడికి
తనువు వడలినా తల్లడిల్లవు
తామ్ర వర్ణంలోకి మారిన నీ జుట్టు
వడగాలికి వడలిన ముఖం
మలిసంధ్య వెలుగులో మసిపట్టిన
నక్షత్రంలా ధీనత నిండిన నీ నేత్రాలు
జిగురంటిన గుడ్డలా ముడతలు పడిన నీ చర్మం
పాదరక్షల ఆడంబరానికి నోచుకోని
ముడుచుకున్న తాబేలు చిప్పల్లా నీ పాదాలు
అయినా, మట్టిని బంగారంలా
మార్చే రసవాదివి నీవు

**ఓ రైతన్నా! మానవజాతి మనుగడకు**
**జీవాధారం నీవే నన్నా!**

ప్రచండ భీకర మధ్యాహ్న మార్తాండుని
మండుటెండలో విరామం ఎరుగని దీక్ష నీది
మలయ మారుతం మబ్బు ఎదను తాకిన
పరవశంలో వర్షించే వానచిలుకుల
కాళ్లకు అందెలనుకట్టే లాస్యం నీది
నీ తేజస్సు ప్రకృతికి ఇంధనం
కార్యసాధకుడవు, నిరంతర దీక్షవు
స్వర్ణస్త్రాలతో పంటలకు జీవం పోసే విరించివి
శ్వేదాన్ని చిందించి పైరులకు
పచ్చని పావడ కట్టే అందానివి
నీ రుధిరాలు మానవ మనుగడకై
మరుగుతున్న దీక్షాగ్ని సెగలకు తైలాలు
**ఓ రైతన్నా! మానవజాతి మనుగడకు**
**జీవాధారం నీవే నన్నా!**

కృషీవలా! నవ యువకుల ఆధునిక
వ్యవసాయ సంబంధిత చదువుల
సారంతో శాస్త్రీయ వైజ్ఞానిక యంత్రాల
సాయంతో పొలం దున్ని
డ్రోన్ల సాయంతో విత్తనాలు చల్లి
కృత్రిమ వానలతో సంతృప్తిచెంది
ఆర్గానిక్ సేద్యం నీ వైద్యంగా
క్షేత్రాన్ని సౌభాగ్యం చెయ్యి సంవత్సరంలో
నాలుగు పంటలతో అధిక దిగుబడులతో
ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే విధానాలతో
చక్కని రవాణా మార్గాలతో
పంటలను చక్కని సుగమ మార్గాల ద్వారా
నిల్వచేస్తూ నూతన ఆవిష్కరణలు చేపట్టి

అగ్రరాజ్యాల అధిక దిగుబడి విధానాలను
కైవసం చేసుకో నీవు ఈ సృష్టికి వెలుగువు
**ఓ రైతన్నా! మానవజాతి మనుగడకు**
**జీవాధారం నీవే నన్నా!**

రైతన్నా! కాలాలు మారినా నీ మౌలికత
మార్చలేరు
ప్రపంచం జనసంచారపు రథమైతే
నీ పంటలు దానికి ఇంధనం
సుజల సాఫల్యాల మిళితమైన
సాంకేతికత నీ మనోబలానికి అండ
నీ జీవితం కావాలి నిత్య సంక్రాంతి
నీ జీవనం కావాలి నవ్య ఉగాది
వసంతంలో కోకిల రాగాలు
మల్లెల సౌరభాలు నీ మనసుకు ఆహ్లాదం కావాలి
జన్మభూమి సేవలో నీవున్నంతవరకు
మానవజాతి అమరత్వం
నిరంతరం సాధ్యం– ఊపిరే విత్తుగా సాగిపో
**ఓ రైతన్నా! మానవజాతి మనుగడకు**
**జీవాధారం నీవే నన్నా!**

☆



## డా. భాస్కర్ కొంపెల్ల

*(పెన్సిల్వేనియా, అమెరికా)*

*Mathematical Physics*లో *Ph.D.*, పట్టా పొందిన తర్వాత - 10 ఏళ్ళు విశ్వవిద్యాలయాల్లో పరిశోధకునిగా, ఆచార్యునిగా, ఆ తర్వాత 25 ఏళ్ళుగా *Motorola, Dell, GE* కంపెనీలలో వివిధ హోదాలలో పనిచేసి ప్రస్తుతం పెన్సిల్వేనియా రాష్ట్రంలోని *Doylestown* అనే నగరంలో నివాసం.

తెలుగు, సంస్కృత, ఆంగ్ల సాహిత్యాలు, విభిన్న సంస్కృతులను అర్థంచేసుకోవడం, పద్యరచన, శాస్త్ర పరిశోధన, సాహిత్యంపై వ్యాసాలు వ్రాయడం, పుస్తకాలు చదవడం, సినిమాలు చూడడం, సంగీతం వినడంతో ప్రశాంత జీవితం గడుపుతున్నారు.

# నేలరేడు

డా. భాస్కర్ కొంపెల్ల

జోహారు జోహారు
అన్నదాతా! జోహారు

అన్నం బ్రహ్మయితే
బ్రహ్మను సృష్టించే బ్రహ్మవు
కానీ... బ్రహ్మకు గుడి లేదోయ్

అన్నం పెట్టే
అమ్మను పోషించే అమ్మవు
కానీ... అమ్మకు నోర్లేదోయ్

**జోహారు జోహారు**
**కృషీవలా! జోహారు**

అందరూ అందలంఎక్కి
ఆకర్షణలేని పనంటే
కర్షకుడవై నిలిచావు
జాతిప్రాణం నిలిపావు.

అందరూ నిను మోసగిస్తే
హాలాహలం మింగే హాలికుడవై
బుద్ధిలేని జీవుల కాఠిన్యం
బట్టబయలు చేశావు

**జోహారు జోహారు**
**ప్రాణత్రాతా! జోహారు**

ఘోరుమంటే గానీ రాని బోరు,
అరిస్తేగానీ అందరాని నీరు,
నీ నారుకి నిన్ను దూరం చేసి
మనశ్శాంతి దోచే మన్ శాంటోలు,
దళారుల దుమారంలో చిక్కావు.
అయినా
కృషిమానని ఋషివయ్యావు.

**జోహారు జోహారు**
**కృషీవలా! జోహారు**

అలుపెరగని సేవలతో,
ఎదురడగని ప్రేమలతో,
ఆయాచితంగా అన్నీ అందించే,
మూగజీవాల సహవాసంలో
మూగవయ్యావు.

పచ్చనిచెట్ల స్నేహాలతో
పచ్చదనం పంచే పనే
నీ ప్రాణం అన్నావు
దాన్ని పణంగా పెట్టావు

**జోహారు జోహారు**
**శక్తిప్రదాతా! జోహారు**

నీకు జరిగిన ప్రతి అన్యాయం
ఈ జాతికి పెద్ద అవమానం
నువ్వు నవ్విన ప్రతి నవ్వు
ఈ దేశమాత సిగలో పువ్వు

మట్టిని మెతుకుగా చేయగలిగే
రామపాదం నీ సంకల్పం
జనసముద్రాన్ని శోషించగలిగే
రామబాణం నీ హలం
నీ సహనాన్ని పరీక్షించే జనం
కొమ్మపైన కూర్చుని
కొమ్మని నరుక్కునే
జ్ఞానంలేని ఈ జనం
నేడు నీ పొట్టకొడుతూంటే
చూస్తూ ఊరుకుంటే
రేపు వాళ్ల పొట్టలు కూడా
మాడి ఏడ్వాలంతే.

జోహారులర్పించే నరులారా! ఆగండి!
ఈ రైతన్నకి నేడే చేయందించండి!

ఈ సేంద్రియ ఐంద్రజాలికుడి మంత్రదండంతో
మీ ఒంటికి ఆరోగ్యం అందించుకోండి. ☆





## శ్రీ ఆది మోపిదేవి

(కాలిఫోర్నియా, అమెరికా)

**వృత్తి:** సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. **ప్రస్తుత నివాసం:** శాండియాగో, కాలిఫోర్నియా, అమెరికా.

చిన్నతనంలోనే తన తండ్రి, ప్రముఖ రచయిత అయిన మోపిదేవి కృష్ణస్వామిగారి రచనలవల్ల ఆది గారికి కూడా సాహిత్యాభిలాష కలిగింది.

ఒకవైపు శ్రీశ్రీ సాహిత్యం, మరోవైపు సిరివెన్నెల గారి రచనల ద్వారా స్ఫూర్తిపొంది తన 16వ ఏటనుండే రచనలు చేయడం ఆరంభించారు ఈయన.

ప్రస్తుత సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, అరాచకాలపట్ల భావోద్వేగం తో రచనలు చేస్తున్న కడుపు మండిన కవి ఈయన.

అందుకే తన కలం పేరును 'కమర' – 'కడుపు మండిన రచయిత'గా  నామకరణం చేసుకున్నారు.

# రైతు మనసు తెలుసుకున్నాను

శ్రీ ఆది మోపిదేవి

కష్టం నష్టం ఆలోచించక
కాయకష్టం స్నేహితులవ్వగ
గుండెల నిండా ప్రేమను నింపి
పవిత్ర భావన పంటను సాకే
**రైతు మనసు చూశాను**

పెరిగిన పంటతో ప్రేమలో మునిగి
పంటకౌగిట్లో ఊయలలూగి
పంట పండగ మురిసిపోయిన
సహవాస స్వర్గాన్ని సంపూర్ణంగా అనుభవించిన
**రైతు మనసు చూశాను**

పంటకోతల పాటలు పాడుతూ
పంటనుకాచే పాట్లను పడుతూ
కుటుంబసహితంగా పంటను కాస్తూ
బాధ్యతభారాన్ని ఆనందంగా మోసిన
**రైతు మనసు చూశాను**

పంటను తిన్న జనులను చూసి
వారి ఆకలి తీరగ ఆనందించి
తన ఆకలిని మరిచి, శ్రమని వలచి
సమాజశ్రేయస్సును ఆస్తిగా ఆనందించిన
**రైతు మనసు చూశాను**

ఇన్నాళ్లు రైతు అన్నమే పెట్టాడనుకున్నాను !! కానీ,

పెరిగేవాడిని చూసి ఆనందించమని
నీ పనిపట్ల కార్యసాధకుడవ్వమని
సమాజశ్రేయస్సు కోసం నీ పాత్ర పోషించమని
ప్రతిఫలం ఆశించక స్వశక్తుడవ్వమని
'రైతు గీత' రచించి, ఆచరించి చూపాడని తెలుసుకున్నాను
ఇప్పుడే అసలు 'రైతు మనస్సు తెలుసుకున్నాను'. ☆



## డా. కె. గీత

(కాలిఫోర్నియా, అమెరికా)

డా. కె. గీత కవయిత్రి, రచయిత్రి, గాయని. "నెచ్చెలి" అంతర్జాల వనితా మాసపత్రిక వ్యవస్థాపక సంపాదకురాలు. కాలిఫోర్నియాలో నివాసం. అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో "తెలుగు భాషా నిపుణురాలి"గా పనిచేస్తున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంనుండి ఆంగ్లం, తెలుగు భాషల్లో ఎం.ఏ పట్టాలు, తెలుగు భాషాశాస్త్రంలో పిహెచ్.డి పట్టా, అమెరికాలో ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్‌లో ఎం.ఎస్ పట్టభద్రురాలైన విద్యావేత్త ఈమె.

"ద్రవ భాష", "శీత సుమాలు", "శతాబ్ది వెన్నెల", "సెలయేటి దివిటీ" "అసింట" అనే కవితా సంపుటాలు; "సిలికాన్ లోయ సాక్షిగా" అనే "కథా సంపుటి; "వెనుతిరగని వెన్నెల" అనే నవల, "At The Heart of Silicon Valley - Short Stories"; "Centenary Moonlight and Other Poems" ప్రచురింపబడ్డాయి. అనేక సాహితీ పురస్కారాలు అందుకున్నారు.

# ఆకరి మాట

డా. కె. గీత

రోజత్తమానం
రెక్కలిరిగేలా దుక్కి దున్ని
బురదలోపడి ఒంగున్నా నడువెత్తకుండా
నాట్లేసి
ముళ్ళు సీరుకుపోతన్నా కలుపేరి
ఒడిసి పట్టీ
పిసికారీలు కొట్టీ
పంట కోసీ
కుప్ప నూర్సీ
పోగులూ మాపులూ
సేలో సెమటోడ్సి
పండించిన గింజలమీద
తినీవోడి పేరున్నాది గానీ
పండించినోడి పేరున్నాదా?
ఇదేం అన్నేయవండీ...?
అయినా
తరాల కాణ్ణించి
ఇదేవన్నేయవని
ఎదిరించిన్నాయాల్లేడు
అఅ...వుప్పుడసలూరుకుండీది లేదండి
అత్తారబత్తంగా
సూసుకునే బిడ్డల్లాటి సేలియ్యి
ఆరుగాలాలపాటు
మమ్మల్ని సల్లగా సూసీ తల్లులియ్యి
ఆరు పాలమెంటులో
కూకుని ఆరికి నచ్చిన సట్టాలు
సేసి పారేత్తే
అస్సలూరుకుండీది లేదండి....ఆయ్

సట్టం ఎనక్కి తీసుకునీదాకా
నా సామిరంగా
సల్లో రోడ్డు మీద
సావనైనా సత్తాం గానీ
ఎనక్కి తగ్గీది లేదండి
పెట్టుబడెట్టినోడికల్లా
మమ్మల్ని గుత్తంగా అమ్మియ్యనాకి
మావేం పాడి పశువులం గాదండి
పెబుత్వం పక్కకి దప్పుకుని
ప్రైవోటోడికి కట్టబెట్టియ్యనాకి
మావేం బీడు బూవులం గాదండి
పేణవున్న మడుసులం
గింజల మీద మా పేర్లొద్దండి
ఆరందరి పేర్లు రాయించుకోమనండి
గిడ్డంగులికి ఆరి బాబుగారి పేరెట్టుకోమనండి
అడిగేవోడేవడు?
అయినా మేవేం అడిగేవండి?
మా బతుకులికి కూసింత దీమా-
అయినా మావు తెల్వకడుగుతన్నావు గానీ
రైతుసట్టం
రైతునడిగి సెయ్యాలని
తెలవందేం పెజాసోమ్యవండీ
నిరంకుశం గానీ...
మరి తెలిసీ నాటకవేమో...
ఆరెన్ని నాటకాలాడినా
మాదిదే ఆకరి మాటండి
మా సట్టం సింపి మా సేతుల్లో ఎట్టీదాకా
మాం ఇంటికెల్లవంతే....ఆయ్ ☆



## శ్రీ శ్రీధరరెడ్డి బిల్లా

*(కాలిఫోర్నియా, అమెరికా)*

శ్రీధరరెడ్డి బిల్లా గారి జన్మస్థలం - వరంగల్ జిల్లాలోని 'మల్లక్కపల్లి' అనే గ్రామం. వృత్తిరీత్యా - సాఫ్టువేరు ఇంజినీరుగా పనిచేస్తూ, గత 12 సంవత్సరాలుగా అమెరికాలో, క్యాలిఫోర్నియాలో నివసిస్తున్నారు.

వీరు మంచి సంగీత, సాహిత్య, హాస్య ప్రియులు.

చిన్న పద్యఖండాలు, వచన కవితలు రాస్తూంటారు. ఇప్పటివరకు - 'ప్రతిబింబం', మరియు 'ఆవలివైపున' అనే రెండు కవిత్వ సంపుటాలు ఈయన కలంనుండి జాలువారి ప్రచురణకు నోచుకున్నాయి.

# వలయం

శ్రీ శ్రీధర్ రెడ్డి బిల్లా

కాలమనే సాలెగూడు అల్లికలో
ప్రతీ వలయంలోనూ చిక్కుతున్నదొకే జీవి!
భువి ఆకలి భారాన్ని
భుజాన మోస్తూ ఆహారమౌతున్న జీవి !
కర్షక జీవి!

పరీక్షించి చూడు ఆ వలయాన్ని.
ఆనాటి సామ్యవాద కంబోడియా..
“నీది లేదు
నాది లేదు
ధనం లేదు
దాపరికం లేదు.
అమ్మకమంటూ అసలే లేదు.
ఉన్నదంతా ఉమ్మడే
సర్వమంతా సమానమే!”
ఆహా ఓహోలంటూ
చప్పట్లు చరిచావు కదా!
గుర్తున్నదా రైతు సోదరా?

నీ రెక్కల కష్టాన్ని మూటకట్టి
లెక్కలేసి దేశమంతా పంచగా
నీ వాటాకు దక్కినదెంత ?
రెండు జొన్న కంకులు!
హతాశుడవైనావు కదూ !

కంటికింద కునుకులేక
ఒంటిపై స్వేదాన్ని
పంటికింద బిగించి
సైన్యం తుపాకీ నీడలో
కండలు కరిగించి
రాశులెన్ని కుప్పవోసినావో?

చంటిబిడ్డ ఆకలన్నదని
పంటనుంచి ఒక్క పొత్త తీసుకున్నందుకే
దొంగవంటూ కాల్చి చంపారే?
కాలం మారాలన్న
నీ గావుకేకల విలయానికి
కాలవలయం మారినదానాడు!

రంగు మారిన
కొత్త వృత్తం...
కొంగొత్త సమీకరణాలు..
భూమి నీది
భుక్తి నీది
శ్రమ నీది
పంట నీది
ఫలితమూ నీదే!

దేశం కోసం..
దేశం మనుగడ కోసం
నీవు నిత్యావసరమట..

'జై కిసాన్' అంటూ నీకు జేజేలు...!
మురిసిపోయావు కానీ
తిరకాసును పట్టలేని
వట్టి అమాయకుడవోయ్!

ఇక్కడే అమ్మాలట
ఇంతకే అమ్మాలట!
రాజ్యమే చెబుతుందట
నీ పంటకు విలువెంతో?
పూజ్యుడవంటూనే ..
నీకు పూజ్యమే గీసింది!
నాటి నీ పెదవి విరుపుల శబ్దానికి
ఆ వలయమూ బద్దలైంది!

ఇప్పుడిక..
ప్రపంచీకరణావృతం
పోటీతత్త్వం..
మార్కెట్టువిలువ..
ఉత్పత్తి గిరాకీ ..
శ్రమకు గుర్తింపు..
అబ్బో ఎన్నెన్ని
అందమైన పదబంధాలో...
నేటివరకు నీవుతప్ప
సమాజానికెవ్వడు ఏమి చేశాడోయ్ ?

ఇప్పుడొచ్చారు !
వాడొకడు టీవీలు
వీడొకడు ఫోనులు
ఇంకొకడు సోఫాలు..
అబ్బో ఎన్నెన్నో
ఎన్నడూ కనని
కొంగొత్త సరుకులు..
అబ్బురపడ్డావా?
పంటతో నీవూ మార్కెట్టుకు వెళితే
పాతాళం కనబడుతోంది కదా ?
మార్కెట్టు కళకళ ..
నీవు వెలవెల!
ఎందుకో తెలుసా?
విలువదక్కని సరుకులు మూతపడినా
నీవు మాత్రం పొట్టమీద కొట్టబోవన్న ధీమా!

ఈ మార్కెట్టుల మంత్రాల వలయంలో
లాభ నష్టాలను ఖాతరుచేయనిదొక్కటే
సుమా!
అదే నీ చెమట చుక్క! ☆






ఉగాది శుభాకాంక్షలు